దేవుడి సొమ్ముకు లెక్కల్లేవు

● ఏళ్లుగా ఆడిట్ జరగని వైనం

నంద్యాల జిల్లాలో ఆడిట్ అభ్యంతరాలను ఆలయ 'ఈవో'లు పట్టించుకోవడం లేదు. చాలా దేవాలయాల్లో గత కొన్నేళ్లుగా ఆడిట్ జరగడమే లేదు. జిల్లాలో 67 ఆలయాలకు సంబంధించి 14,433 ఆడిట్ అభ్యంతరాలు ఉన్నాయి. రూ.79.80 కోట్లకు లెక్కలు తేలడం లేదు. కర్నూలు జిల్లాలో 46,907 ఎకరాలు మాన్యం భూములు ఉన్నట్లు.. వీటి ద్వారా ఏటా రూ.1.82 కోట్ల ఆదాయం సమకూరుతోందని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి రూ.4 నుంచి రూ.5 కోట్ల వరకు ఆదాయం రావాల్సి ఉంది. – న్యూస్‌టుడే, కర్నూలు నగరం

తప్పించుకోవడానికి ఎత్తులు

▼ దేవాదాయ శాఖ పరిధిలో రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఆదాయం ఉన్న ఆలయాలు 6 (సి) విభాగం కింద ఉన్నాయి. ఆయా దేవాలయాలకు హుండీలు, టికెట్ల ఆదాయంతోపాటు వ్యవసాయ భూముల కౌలు వేలం ద్వారా సొమ్ము సమకూరుతుంది. స్థలాలు, దుకాణాల ద్వారానూ ఆదాయం లభిస్తుంది. రోజువారీ పూజలు, ఉద్యోగుల వేతనాలు, వివిధ రకాల ఉత్సవాలు, కార్యక్రమాలు, అన్నదానం తదితర వాటికి వెచ్చిస్తారు.

▼ నందికొట్కూరు, శ్రీశైలం, డోన్, బనగానపల్లి నియోజకవర్గాల పరిధిలోని పలు ఆలయాల 'లెక్క'లు తేలడం లేదు. అక్రమాలు వెలుగులోకి వస్తాయన్న ఉద్దేశంతో ఈవోలు ఉద్దేశపూర్వకంగానే 'ఆడిట్'కు ఇష్టపడటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లెక్కతప్పిన భూముల వేలం

◆ ఆలయ గెజిట్ ప్రకారం ఆలయ భూములకు క్రమపద్ధతిలో కౌలు వేలం పాటలు నిర్వహించాలి. వేలం పాటలు జరిగినట్లు చాలాచోట్ల 'లెక్కలు' రాశారు. అయినవారికి భూములను కట్టబెట్టారు. ఆలయ ఆదాయం ఒకలా వస్తుంటే వీరు మరోలా లెక్కలు చూపారు. గడివేముల శ్రీచెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించి 40 ఎకరాల భూముల వివరాలకు చాలా ఏళ్లుగా లెక్కలు లేవు. ఈ భూముల్లో కొంత దస్త్రాల్లోనూ కనిపించడం లేదు.

◆ భూముల వేలం పాటలు కూడా సరిగా నిర్వహించలేదు. కౌలును కూడా దేవాదాయ శాఖకు జమ చేయలేదన్న ఆరోపణలున్నాయి. దీంతో 'ఆడిట్'కు సహకరించడం లేదు.

◆ హుండీ లెక్కింపులు కూడా సరిగా జరగలేదు. ఆలయ ఖర్చులు తక్కువగా చేసి అధిక మొత్తం వెచ్చించినట్లు దస్త్రాల్లో నమోదు చేసి నిధులు పక్కదారి పట్టించారు.

నిధులు స్వాహా చేసి..

□ ఆలయాల పరిస్థితులు, ఆదాయాన్ని బట్టి సహాయ కమిషనర్, ఉప కమిషనర్, ప్రాంతీయ కమిషనర్, కమిషనర్ నుంచి బడ్జెట్ ఆమోదం పొందాలి. వీటన్నింటిని ఆడిట్ శాఖకు ఇవ్వాలి. జిల్లాలో 6 (సి) కింద ఉన్న పలు దేవాలయాల్లో ఆడిటింగ్ సక్రమంగా జరగడం లేదు.

□ నందికొట్కూరు, జూపాడు బంగ్లా, బేతంచెర్ల, కొత్తపల్లి, వెలుగోడు మండలాలకు చెందిన కొన్ని ఆలయాల్లో గతంలో ఈవోలుగా పనిచేసిన అధికారులు పెద్దఎత్తున నిధులను స్వాహా చేశారన్న ఆరోపణలున్నాయి. ఈ ప్రాంతాలకు చెందిన ఆలయాలకు ఈవోగా పనిచేసిన వ్యక్తి సస్పెండ్ అయ్యారు.

చెత్తబుట్టల్లో చదువులు

కర్నూలు నగరం ప్రకాశ్‌నగర్‌లోని కటంగుటూరు ప్రకాశం పంతులు ప్రాథమిక పాఠశాలలో 112 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ సామగ్రి భద్రపరిచే గదిలోనే చిన్నారులకు పాఠాలు చెబుతున్నారు. మనబడి మన భవిష్యత్తు కింద ఈ పాఠశాలకు పూర్తిస్థాయిలో బల్లలు రాకపోవడంతో పిల్లలు కిందే కూర్చోవాల్సి వస్తోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెత్తబుట్టలను తెచ్చి నగరపాలక అధికారులు ఇదే గదిలో పెట్టారు. వాటి మధ్యనే పిల్లలు చదువుకోవాల్సి వస్తోంది. దీనిపై హెచ్‌ఎం కళావతమ్మ మాట్లాడుతూ.. రోడ్డుపై ఉన్న చెత్తబుట్టలు చోరీకి గురవుతాయని పాఠశాలలో పెట్టారని చెప్పారు. బల్లలు లేని విషయాన్ని మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు విద్య

పార్కింగ్ జాగాలో అద్దె దందా

సెల్లార్లలో దుకాణాల ఏర్పాటు ◆ పట్టించుకోని అధికారులు

మున్సిపాలిటీల్లో భవన సముదాయ యజమానులు నిబంధనలు పాటించడం లేదు. నిర్మాణ సమయంలో సెల్లార్ భూగర్భంలో పార్కింగ్ స్థలం కింద అనుమతులు తీసుకొంటున్నారు. నిర్మాణాలు పూర్తయ్యాక కొన్నాళ్లు ఖాళీగా ఉంచుతున్నారు. అనంతరం అద్దెకిచ్చి ఆదాయం పొందుతున్నారు. విధిలేక వాహనదారులు తమ వాహనాలను రోడ్లపై నిలిపేస్తున్నారు.. దీని వల్ల ట్రాఫిక్ అంతరాయం తలెత్తుతోంది. చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతున్నారు. – న్యూస్‌టుడే, ఆదోని, నంద్యాల, ఎమ్మిగనూరు పురపాలికలు

ఆదోని పట్టణంలో ప్రధాన రహదారిలో వ్యాపార భవన సముదాయంలో పరిస్థితి ఇది. భవన సముదాయం కింది భాగం పార్కింగ్‌కు కేటాయించాల్సి ఉండగా.. హోటల్‌కు అద్దెకిచ్చారు. దీంతో ఇక్కడికి వచ్చేవారంతా రహదారిపై వాహనాలు నిలుపుతున్నారు.

పురపాలిక	సెల్లార్ల సంఖ్య
కర్నూలు	124
నంద్యాల	53
ఆదోని	15
ఎమ్మిగనూరు	42
డోన్	7

నిబంధనలు కప్పేసి

■ ఉమ్మడి జిల్లాలో కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ మున్సిపాలిటీల్లో వ్యాపార సముదాయాలు ఎక్కువ. నిబంధనల ప్రకారం 500 చదరపు మీటర్లు ఆపైస్థాయి భూవిస్తీర్ణం ఉంటేనే సెల్లార్‌కు అనుమతులిస్తారు. చాలా చోట్ల తక్కువ విస్తీర్ణం ఉన్నా.. నిర్మాణాలు సాగించేస్తున్నారు.

■ నిర్మాణ ప్రాంతంలో మట్టి పరీక్షలు నిర్వహించాలి. ఈ నివేదిక మీదనే అనుమతులు ఆధారపడి ఉంటాయి. ఆపై పురపాలక, బీమా, అగ్నిమాపక శాఖలతో అనుమతులు తీసుకోవాలి.

■ సెల్లార్ నిర్మాణం చేయాలంటే ముందు భాగంలో కనీసం 3 మీ. పార్కింగ్ స్థలం వదలడంతో పాటు ఇరు పక్కల, వెనుక భాగంలో 2.5 మీ. మేర సెట్ బ్యాక్ స్థలాలు వదలాలి.

■ భవన నిర్మాణం విస్తీర్ణం, అంతస్తులు పెరిగేకొద్దీ సెట్ బ్యాక్ స్థలాలు వదిలే కొలతలు పెరుగుతాయి. ఇక ప్రతి వాణిజ్య సముదాయం ముందు పార్కింగ్ స్థలాలు వదలాలి. ఎక్కడ కూడా నిబంధనలు పాటించడం లేదు.

ఎక్కడ ఎలా ఉందంటే..

▸▸ ఆదోని పట్టణంలో కోట్ల కూడలిలో మూడు సెల్లార్ సముదాయాలున్నాయి.. వీటిని వాణిజ్య అవసరాలతో పాటు హోటల్, ఔషధ దుకాణాలకు అద్దెకిచ్చారు. ఆర్ట్స్ కళాశాల ప్రాంతంలో మినీ ఫంక్షన్ హాల్‌గా వినియోగిస్తున్నారు. పీఎన్ రహదారిలో ఒకటి వస్త్ర వ్యాపారాలకు, మరొకటి ఫ్యాన్సీ, స్టీల్ సామగ్రి వ్యాపారాలకు అద్దెకిచ్చారు. దీంతో పార్కింగ్ ముందు వైపు నిలిపి ఉంచుతున్నారు. పురపాలక రహదారిపై కొత్తగా నిర్మించిన మూడు సముదాయాలు ముందు వైపు సెట్ బ్యాక్ స్థలాలు వదలకుండానే నిర్మాణాలు చేశారు. ఎస్కేడీ కాలనీలో రెండు చోట్ల ఇదే పరిస్థితి ఉంది.

▸▸ ఎమ్మిగనూరులో ప్రధాన మార్కెట్ ప్రాంతంతో పాటు శ్రీనివాస కూడలి, బంగారు బజారు, ఆదోని రహదారిలో అధికంగా సెల్లార్ సముదాయాలున్నాయి. అన్నింటిని వాణిజ్య అవసరాలకు అద్దెకిచ్చి ఆదాయం పొందుతున్నారు.

▸▸ కర్నూలు నగరంలో రాజ్ విహార్, మార్కెట్ ప్రాంతం, రైల్వే స్టేషన్ రహదారి, నంద్యాల, డోన్, బళ్లారి రహదారి, కల్లూరు ప్రాంతం, కృష్ణానగర్‌తో పాటు నగరం లోపల చాలా ప్రాంతాల్లో సెల్లార్‌లున్నాయి. వీటిని వాణిజ్య దుకాణాలకు బాడుగలకిచ్చారు.

ఇబ్బందులివి..

➡ నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రధానంగా ట్రాఫిక్ సమస్యలతో పాటు రహదారి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. దీంతో పాటు వాణిజ్య సముదాయాలు కావడంతో, అధిక మొత్తంలో దుకాణాలుంటాయి. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు సహాయక చర్యలకు విఘాతం కలుగుతోంది.

➡ చుట్టూ అగ్నిమాపక దళం వెళ్లేందుకు మార్గం లేక, లోపలి భాగంలో ప్రమాద నివారణ చర్యలు సకాలంలో జరగకపోవడంతో అధికంగా నష్టం జరిగే అవకాశాలున్నాయి. ఇక జనం బయటపడేందుకు మార్గాలు లేకపోవడం, బయట పడేందుకు ఒకే మార్గం ఉండటంతో ప్రాణ నష్టం సంభవించే అవకాశాలున్నాయి.

➡ గాలి, వెలుతురు లేకపోవడం వల్ల ఇబ్బందికర వాతావరణం ఏర్పడుతుంది. వివిధ రకాల భద్రత కారణాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు నిబంధనలు తీసుకొస్తే, వాటికి క్షేత్రస్థాయిలో నీళ్లొదులుతున్నారు.

నీట్ పీజీ పరీక్షకు పటిష్ఠ ఏర్పాట్లు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఆదివారం జరుగనున్న నీట్ పీజీ-2026 ఆన్‌లైన్ పరీక్షను సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డా.సిరి ఆదేశించారు. నీట్ ఆన్‌లైన్ పరీక్ష ఏర్పాట్లపై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ శనివారం టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు.

● జిల్లాలో కర్నూలులో 5, ఆదోని 1, ఎమ్మిగనూరు 1 కలిపి మొత్తం ఏడు పరీక్షా కేంద్రాల్లో నీట్ పీజీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2,114 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని వెల్లడించారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, 7 గంటల నుంచే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు.

08518- 277305కు ఫోన్‌చేయండి

నీట్ పీజీ-2026 పరీక్ష నిర్వహణకు సంబంధించి కర్నూలు కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్, కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు సందేహాల నివృత్తి కోసం హెల్ప్ డెస్క్ నంబరు 08518-277305కు సంప్రదించాలని సూచించారు.

భద్రత కట్టుదిట్టం

కర్నూలు నేరవిభాగం : నీట్ పీజీ పరీక్షకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్ష జరుగనుందని, ఎవరైనా తప్పిదాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

శిక్షణ పొందిన మధ్యవర్తులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

నాణ్యమైన న్యాయ సేవలందించాలి

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : కక్షిదారులకు నాణ్యమైన న్యాయ సేవలు అందించేందుకు మధ్యవర్తులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి సూచించారు. 40 గంటల శిక్షణ పూర్తి చేసుకున్న మధ్యవర్తులకు నగరంలోని న్యాయ సేవా సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రితో కలిసి శనివారం ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : సెప్టెంబరు 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి సూచించారు. నగరంలోని న్యాయ సేవా సదన్ నుంచి శనివారం ఆయన ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

సోమనాథ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : సోమనాథ్ యాత్రకు వెళ్లేందుకు ఆసక్తి కలిగిన భక్తులు దరఖాస్తు చేసుకోవాలని దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రకు వెళ్లే భక్తులకు శ్రీశైల దేవస్థానం తరపున ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. యాత్రలో పాల్గొనదలచిన వారు ఆదివారం సాయంత్రం 5 గంటలలోపు ప్రజా సంబంధాల విభాగంలో తెలియజేయాలన్నారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు లేకుండా పూర్తి ఆరోగ్యవంతులుగా ఉన్నవారు మాత్రమే యాత్రకు సిద్ధం కావాల్సి ఉంటుందన్నారు. సోమనాథ్ ఆలయంపై దాడి జరిగి వెయ్యి సంవత్సరాలు, పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా భారత ప్రభుత్వం 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్-1000 అఖండ విశ్వాసం' పేరుతో జాతీయ వార్షికోత్సవాలు నిర్వహిస్తోందని చెప్పారు. యాత్రకు వెళ్లే పూర్తి వివరాలను దేవస్థానం త్వరలో తెలియజేయనున్నట్లు చెప్పారు.

రాఘవుడి సన్నిధిలో పూర్వారాధన

మంత్రాలయంలో పూర్వారాధన శనివారం నయనానందకరంగా సాగింది. రాఘవేంద్ర స్వామి ప్రహ్లాదరాయల రూపంలో సింహ వాహనంపై కొలువుదీరి శ్రీమఠంలో ఊరేగగా.. భక్తులు తిలకించి మంత్రముగ్ధులయ్యారు. గ్రామ దేవత మంచాలమ్మ, ప్రహ్లాదరాయలు, రాఘవేంద్రస్వామి మూల బృందావనం, పూర్వ పీఠాధిపతుల బృందావనాలకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో సంస్థాన పూజలు చేశారు. బంగారు మండపంలో మూలరాములు, దిగ్విజయరాములు, జయరాములు, సంతాన గోపాలకృష్ణ, వైకుంఠవాసు దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు మూలరాముల దర్శనం కల్పించారు. అనంతరం రాత్రి పుష్ప, పట్టు వస్త్రాలతో అలంకృతుడైన ప్రహ్లాదుడు రాత్రి సింహ వాహనం, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఊరేగారు. శ్రీరంగం రంగనాథ స్వామి ఆలయ అధికారులు స్వామికి పట్టు వస్త్రాలు, ప్రసాదాలు తెచ్చారు. మఠం అధికారులు వారికి ఘన స్వాగతం పలికి ఊరేగింపుగా తెచ్చిన వస్త్రాలను రాఘవేంద్రస్వామి బృందావనానికి సమర్పించారు. ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు, ఎస్.కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, పీఆర్వో ఐ.పి.నరసింహస్వామి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మంత్రాలయం, మంత్రాలయం గ్రామీణం

అలంకరణలో సంతాన గోపాలకృష్ణుడు, హాజరైన భక్తజనం

శ్రీరంగం నుంచి తీసుకొచ్చిన పట్టువస్త్రాలు స్వామికి సమర్పించేందుకు తీసుకెళ్తున్న పీఠాధిపతి

కరవు వచ్చినా కదలరు

● ఈ-పంట నమోదులో వెనుకంజ
● పెండింగ్‌లో 2,65,297 ఎకరాలు

పంట ఉత్పత్తుల్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నా.. పంటలు దెబ్బతిన్న సందర్భాల్లో పెట్టుబడి సాయం, నష్ట పరిహారం, పంటల బీమా అందాలన్నా.. వ్యవసాయ రుణాలు, రాయితీ పథకాల లబ్ధి పొందాలన్నా తప్పనిసరిగా ఈ-పంట నమోదై ఉండాలి. ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన అన్ని రకాల పంటలతో పాటు బీడు, వ్యవసాయేతర భూములన్నింటికీ ఈ-పంట నమోదును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ప్రతి ఎకరాకు ఈ.పంట నమోదు చేయించాలని సీఎం ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో కర్నూలులో 79 శాతం, నంద్యాలలో 66 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. వీటి నమోదులో యంత్రాంగం వెనుకబడింది. – న్యూస్‌టుడే, కర్నూలు వ్యవసాయం

రైతులే స్వయంగా చేసుకోవచ్చు

ఈ-పంటలో రైతులు తమ వివరాలను స్వయం నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. ఇందుకోసం ఏపీఏఐఎంఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. మొబైల్ నంబరు, ఆధార్‌తో లాగిన్ అయ్యి.. తమ పేరుతో ఉన్న విస్తీర్ణంలో ఏ సర్వే నంబరులో ఏ పంట సాగు చేశారో నమోదు చేసుకోవచ్చు. ఈ-కేవైసీ కూడా చేసుకునే వెసులుబాటు ఉంది. రైతులే స్వయంగా ఈ-పంట నమోదు చేసుకునే విధానంపై వ్యవసాయశాఖ అవగాహన కల్పించకపోవడంతో చాలామంది ఈ అవకాశాన్ని ఉపయోగించుకోలేక పోతున్నారు.

గడువు పెంచినా కనిపించని పురోగతి

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవక ఈసారి సాగునీటి సమస్య తలెత్తింది. దీంతో వరి అంతంత మాత్రంగానే సాగైంది. ఇప్పటి వరకు కర్నూలు 20 శాతం, నంద్యాల జిల్లాలో 27 శాతం మాత్రమే వరి వేశారు. వరి సాగు చేసిన రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకానికి ప్రీమియం చెల్లించేందుకు ఆగస్టు 15వ తేదీతో గడువు ముగిసినప్పటికీ ఈనెల 31వ తేదీ వరకు పొడిగించారు. అయినాసరే చాలా తక్కువమంది రైతులు మాత్రమే బీమా ప్రీమియం చెల్లించారని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రీమియం చెల్లించి ఊరుకున్నారు

ఈ ఏడాది పంటల బీమా చేసిన సాగు విస్తీర్ణం పెరిగింది. గతేడాది ఖరీఫ్‌తో పోలిస్తే ఈసారి ఉమ్మడి కర్నూలు జిల్లాలో వాతావరణ ఆధారిత, ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద 3.70 లక్షల మంది రైతులు 4.40 లక్షల హెక్టార్లకు బీమా చేయించారు. రైతులు తమ వాటాగా రూ.98.84 కోట్ల ప్రీమియం చెల్లించారు. వీరందరికీ పంటల బీమా వర్తించాలంటే ప్రతి రైతు ఈ-పంటలో తమ పేరు నమోదు చేసుకోవాల్సిందే. లేదంటే పంటల బీమా ప్రీమియం చెల్లించినా చేసినా ఆమోదం లభించదు. ఈ-పంటలో నమోదైన, బీమా చేసిన పంట ఒకటే అయ్యుండాలి. తేడా ఉంటే బీమా సంస్థలు తిరస్కరించే ఆస్కారం ఉంది. ఈ-పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ కూడా చేయించుకోవాలి.

సాగు తగ్గినా వెనుకబాటే

ఖరీఫ్ సాధారణ సాగు.. జిల్లాలో 4,34,996 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 3,44,170 హెక్టార్లలో (79 శాతం) పంటలు సాగయ్యాయి. ఇందులో పత్తి 2,32,761, వేరుసెనగ 20,114, కంది 52,626, వరి 2,690, ఆముదం 8,689, టమాట 2,362, ఉల్లి 9,807, మిరప 18,725 హెక్టార్లలో సాగు చేశారు. అన్ని రకాల పంటలు కలిపి 8,50,099 ఎకరాల్లో సాగవుతుండగా.. ఇప్పటి వరకు 6.62 లక్షల ఎకరాల్లో మాత్రమే ఈ.పంట నమోదు చేశారు. మరో 1.87 లక్షల ఎకరాల్లో నమోదు చేయాల్సి ఉంది.

తుంగభద్రకు తగ్గిన వరద

హాలహర్వి, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టిందని డ్యాం బోర్డు అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల సమయానికి 11,574 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో 1,630.62అడుగులకుగాను 96.42 టీఎంసీల నిల్వ ఉంది.

సాధన నిత్యం.. పతకాలు సొంతం 16లో

ఇంతుల్లో పారిశ్రామిక కాంతులు

ప్రతి ఇంట్లో పారిశ్రామికవేత్తను తయారు చేసే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంఈ) పథకానికి స్త్రీనిధిని అనుసంధానించారు. దీంతో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆహార శుద్ధి యూనిట్లను నెలకొల్పేందుకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక సాయం మరింత సులభంగా అందనుంది. ఇప్పటివరకు స్త్రీనిధి ద్వారా రూ.2 లక్షల వరకు రాయితీ లేని రుణాలు అందిస్తున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కొత్తగా తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా మహిళలకు రాయితీతో కూడిన వ్యక్తిగత రుణాలు అందించనున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

	నంద్యాల	కర్నూలు
స్వయం సహాయక సంఘాలు	30,552	32,150
సభ్యులు	3,13,621	3,20,150
స్త్రీనిధి రుణ లక్ష్యం	రూ.376.72 కోట్లు	రూ.411.09 కోట్లు
లబ్ధి పొందే సభ్యులు	36,324	39,648

35 శాతం రాయితీ వర్తింపు

ఇప్పటి వరకు స్త్రీనిధి సంస్థ ద్వారా మహిళలకు రుణ మంజూరు వరకే పరిమితమయ్యేది. తొలిసారిగా రాయితీ వర్తించే పథకాలను అనుసంధానించారు. పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్, చిరుధాన్యాలు, పప్పులు, మసాలాలు, పచ్చళ్లు, పిండి వంటలు, స్నాక్స్ వంటి ఆహార ఉత్పత్తి యూనిట్లను పీఎంఎఫ్‌ఎంఈ పథకం కింద ఏర్పాటు చేసుకుంటే వారు పొందే రుణంపై 35 శాతం రాయితీ లభిస్తుంది.

రుణ పరిమితి పెంపు

గతంలో స్త్రీనిధి రుణాలను రూ.2 లక్షల వరకు మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుతం రూ.3 లక్షల వరకు అందిస్తున్నారు. ఇందులో 10 శాతం లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. రూ.3 లక్షల వరకు రుణం తీసుకుంటే రూ.1.05 లక్షల వరకు రాయితీ (35 శాతం) లభించనుంది. యూనిట్లలో ఉత్పత్తికి అవసరమయ్యే ముడిసరకు సేకరణ, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ సౌకర్యాలను ప్రభుత్వమే కల్పిస్తుంది.

దరఖాస్తు ఇలా..

ఆహార ఉత్పత్తుల తయారీలో ఆసక్తి ఉన్న మహిళలు మండల మహిళా సమాఖ్య (వెలుగు కార్యాలయం)లో సంప్రదించవచ్చు. అర్హతల పరిశీలన అనంతరం అధికారులు ప్రాజెక్టు రూపకల్పన, స్థాపనకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారు. ముడి సరకు సేకరణ నుంచి మార్కెటింగ్ వరకు అండగా ఉంటారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం అనుమతులు ఇస్తామని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి తెలిపారు. మండలాల వారీగా యూనిట్ల ఏర్పాటుకు లక్ష్యాలను నిర్దేశిస్తామని చెప్పారు.

డిప్లొమా పారామెడికల్
Bollineni Medskills
Qualification
INTER ANY GROUP
• DANS • D-CARDIO • DMLT
• DMIT • DMST • DPERFU
• DCLT • DDIALY
BOLLINENI MED SKILLS AND PARAMEDICAL INSTITUTION
KIM'S HOSPITAL CAMPUS, KURNOOL
Cell : 73375 55292, 7680945357

భవనములు అద్దెకు కావలెను
రాష్ట్రంలో పేరెన్నికగన్న విద్యాసంస్థ తమ కాలేజీలను నడుపుటకు అనుకూలంగా ఉన్న కట్టిన భవనములు కర్నూలు నందు క్రింద పేర్కొనబడిన పరిమాణంలో అద్దెకు కావలెను. బస్టాండ్ - బస్టాప్ పరిసర ప్రాంతాల్లోని భవనములకు ప్రాధాన్యత ఇవ్వబడును.
♦ భవన వైశాల్యము 20000 నుండి 30000 చ॥అ॥లు వుండాలి.
♦ కనీసము 25 గదులు కలిగి ఉండవలెను.
♦ ఒక్కొక్కగది విస్తీర్ణము కనీసము 400 చ॥అ॥ కలిగి ఉండవలెను.
భవనములు సిద్ధంగా వున్నా, లేదా కట్టించి ఇచ్చుటకు ఆసక్తి వున్న యజమానులు ఈక్రింది ఫోన్ నెంబర్లలో సంప్రదించండి.
Cell: 8341024666, 7386336662



(c) eenadu

ఈ శ్రావణమాసంలో మీ ఈనాడు పెళ్లిపందిరితో సంతోషకరమైన పెళ్లిళ్లకు శ్రీకారం!

స్వకులసాలి కుల వధూవరులకు సువర్ణావకాశం

నేడు స్వకులసాలి కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' స్వకులసాలి వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని రాజ్‌విహార్ సెంటర్‌లో రాజ్ థియేటర్ ఎదురుగా ఉన్న ఈనాడు కార్యాలయం వేదికగా నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (ఆదివారం, ఆగస్టు 30న) ఉదయం 9 గం॥ నుంచి సాయంత్రం 5.30 గం॥ వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.
★ వధూవరుల బయోడేటా & ఫొటోలను క్రింద తెలిపిన వాట్సాప్ నంబర్లకు పంపి ఉచితంగా ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు **91543 66099 & 91547 72006**

నరసింహస్వామికి పూల దండ

నల్లచెలిమల (దేవనకొండ) న్యూస్‌టుడే: శ్రావణమాసం మూడో శనివారం పురస్కరించుకొని మండలంలోని నల్లచెలిమల గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ ప్రాంతంలో స్వామివారిని పూలదండల దేవుడిగా పిలుస్తారు. పూలదండల కార్యక్రమం సైతం ఉండటంతో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. వానలు సకాలంలో కురవాలని, పంటలు పండాలని కోరుకున్నారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు పూలదండల మహోత్సవం నిర్వహిస్తారు. గన్నేరుపూలతో భవిష్యత్తు తెలిపే కార్యక్రమం దేశంలో ఎక్కడా జరగదని ఇక్కడి ప్రజలు చెబుతుంటారు. సాయంత్రం స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉత్సవం పురస్కరించుకొని గ్రామస్థులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి

ఆంజనేయుడికి పల్లకి సేవ

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారు కొండపై వెలిసిన శ్రీరణమండల ఆంజనేయస్వామి క్షేత్రం జైశ్రీరామ్.. జైహనుమాన్ నామంతో పులకించిపోయింది. శ్రావణమాసం మూడో శనివారం పురస్కరించుకొని ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామి వారికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, ఆకుపూజ, మహామంగళహారతి వంటి పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో స్వామి వారి పల్లకి ఉత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శ్రావణమాసం మూడో శనివారం కావడంతో ఆదోని పట్టణం, చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

శ్రీరణమండల ఆంజనేయస్వామికి విశేష అలంకరణ

కొండపై స్వామివారి దర్శనానికి క్యూకట్టిన భక్తులు

దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రుడు

సెప్టెంబర్ 3 వరకు విధుల బహిష్కరణ

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ సాధనే లక్ష్యంగా సెప్టెంబరు 3వ తేదీ వరకు న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలపాలని రాయలసీమ న్యాయవాదుల జేఏసీ తీర్మానించినట్లు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.చంద్రుడు తెలిపారు. కర్నూలులో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం ఆరోరోజుకు చేరాయి. జిల్లా కోర్టు వద్ద చేపట్టిన దీక్షలో న్యాయవాదుల మామిళ్ల విక్టర్, కృష్ణప్రసాద్, శ్రీనివాసులుగౌడ్, శ్రీనివాసులు, రాము, ఎండీ మహేశ్‌కుమార్‌లు కూర్చున్నారు. చంద్రుడు మాట్లాడుతూ సానుకూల ప్రకటన వెలువడే వరకు పోరాటం కొనసాగుతుందని చెప్పారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు రసూల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సాధన నిత్యం.. పతకాలు సొంతం

వివిధ పోటీల్లో ప్రతిభ

అవుకు, న్యూస్‌టుడే: చేతిలో పిడికిలి బలం.. కళ్లలో విజయాల కోసం తపన.. బాక్సింగ్ రింగ్‌లో అడుగుపెట్టగానే ప్రత్యర్థులపై పంచ్‌ల వర్షం కురిపిస్తున్నారు గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు. జిల్లా నుంచి జాతీయ స్థాయి వరకు పలు ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని పతకాలను సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. భవిష్యత్తులో బాక్సింగ్‌లో అంతర్జాతీయ, ఒలింపిక్ క్రీడల్లో పాల్గొని సత్తాచాటడమే లక్ష్యంగా చెమటోడుస్తున్నారు. బాక్సింగ్‌లో సత్తాచాటుతున్న పల్లె విద్యార్థులు

అవుకు గ్రామానికి చెందిన నంద సాత్వి క్‌రెడ్డి, గుర్రాల పూజిత్ అవుకులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఆరో తరగతి నుంచే వారు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకున్నారు. ఇరువురు జంటగా బాక్సింగ్‌లో సాధన చేస్తూ ప్రశంసలు పొందుతున్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించిన పాఠశాల నిర్వాహకుడు ముచ్చలపురి శ్రీనివాసులు వారికి ప్రోత్సాహం అందించారు.

నంద సాత్విక్‌రెడ్డి

పూజిత్

- 2025లో పాఠశాల స్థాయిలో నంద్యాలలో జరిగిన మొదటి ఇంటర్ జోనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని అండర్-14, 80 కేజీల విభాగంలో సత్తాచాటి జిల్లా స్థాయిలో ఇరువురూ బంగారు పతకాలు సాధించారు.
- 2026 జనవరిలో నందవరంలో జరిగిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో సాత్విక్‌రెడ్డి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించగా, పూజిత్ రెండో స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సొంతం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.
- 2026 జనవరిలో కృష్ణా జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని 80 కేజీల విభాగంలో సాత్విక్ రెడ్డి మొదటి స్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నారు. అనంతరం 2026 ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో నిర్వహించిన అంతరాష్ట్ర పోటీల్లో సత్తాచాటి బంగారు పతకాలు సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.
- 2026 మార్చిలో సికింద్రాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి అండర్-14 బాక్సింగ్ పోటీల్లో పూజిత్ పాల్గొని వెండి పతకం సొంతం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లోనూ సత్తా చాటారు.
- సాధారణ కుటుంబానికి చెందిన తనకు పాఠశాల నుంచి మంచి ప్రోత్సాహం లభించిందని, రానున్న రోజుల్లో అంతర్జాతీయ స్థాయి, ఒలింపిక్ క్రీడల్లో పాల్గొని సత్తాచాటడమే తమ లక్ష్యమని విద్యార్థులు చెబుతున్నారు.

జలాశయాల్లో నీరున్నా పంటలకు ఇవ్వరా

- ☛ ఇరిగేషన్ అధికారులపై ఛైర్మన్, సభ్యుల అసంతృప్తి
- ☛ ముగిసిన చివరి జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : తుంగభద్ర డ్యాం, శ్రీశైలం జలాశయాలకు వరద జలాలు చేరినా ఒక్క పంటకు కూడా సాగునీరు ఇవ్వలేరా అని జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. జిల్లా పరిషత్ 30వ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరంలోని జడ్పీ కార్యాలయంలో ఛైర్మన్ అధ్యక్షతన జరిగాయి. సీఈవో సుధాకర్‌రెడ్డి, ఉప సీఈవో వెంకటసుబ్బారెడ్డి వివిధ శాఖల అధికారులు, జడ్పీటీసీ సభ్యులు హాజరయ్యారు. వ్యవసాయం, సాగునీరు, పశు సంవర్ధక, పంచాయతీరాజ్, విద్యుత్తు, వీబీ జీ రామ్‌జీ, ఉద్యాన తదితర శాఖల పరిధిలో జరుగుతున్న పనులపై చర్చించారు. కీలకమైన జడ్పీ సమావేశాలకు ప్రతిసారి గైర్హాజరవుతున్న ఇరిగేషన్ ఇంజినీర్లకు నోటీసులు జారీ చేయాలని ఛైర్మన్ సీఈవోను ఆదేశించారు. శనివారం జరిగిన సమావేశానికి ఎల్లెల్సీ, కేసీసీ, ఎస్సార్బీసీ, తెలుగుగంగ, 68 చెరువులు, జీడీపీ, జీఆర్‌పీ ప్రాజెక్టుల ఇంజినీర్లు హాజరుకాలేదు.

మాట్లాడుతున్న ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వేదికపై సీఈవో సుధాకర్‌రెడ్డి

ప్రజలు, రైతులను ఇబ్బందిపెట్టడం సరికాదు

తుంగభద్ర జలాశయానికి 90- 100 టీఎంసీలు, శ్రీశైలం డ్యాంకు సుమారు 200 టీఎంసీల వరదనీరు వచ్చిందని.. అయినా రైతులకు సాగునీరు ఇవ్వలేకపోయారని జడ్పీ ఛైర్మన్ ఇరిగేషన్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా నీటిని నిల్వ చేసుకోవాలన్న ప్రభుత్వ ముందుచూపును అభినందించారు. ఉమ్మడి జిల్లా తాగునీటి అవసరాలకు ఏడాదికి 5- 6 టీఎంసీల నీరు సరిపోతుందని, శ్రీశైలం, టీబీ డ్యాంలలోని నీళ్లను సాగుకు విడుదల చేసే అవకాశముందని చెప్పారు. గతంలో ఇంతకంటే తక్కువ వరదనీరు వచ్చినపుడు కూడా పంటలకు నీరు ఇచ్చిన సందర్భాలున్నాయన్నారు. ఇక్కడి రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేసి దిగువకు నీటిని తరలించడం ఎంత వరకు సమంజసమని జడ్పీటీసీ సభ్యులు మురళీధరరెడ్డి, మహేశ్వరరెడ్డి ప్రశ్నించారు. జిల్లాలో 68 చెరువులు, గాజులదిన్నె ప్రాజెక్టుకు నీటిని ఎపుడు విడుదల చేస్తారని ఛైర్మన్, జడ్పీటీసీ సభ్యులు రఘునాథరెడ్డి, రామకృష్ణ ప్రశ్నించారు. కర్నూలు ఎంఐ ఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నీటి విడుదలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సి ఉందని చెప్పారు.

- ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాగు చేసిన పంటలు చేతికొచ్చే పరిస్థితి లేనందున, పశు పోషణ ద్వారా రైతులు ఆదాయం పొందేలా ప్రచారం చేయాలని, బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని ఛైర్మన్, జడ్పీటీసీ సభ్యులు కోరారు.
- పీఎం కిసాన్ సొమ్ము అందలేదని మండల ఏవోను సంప్రదించగా దస్త్రాల్లో మీరు మరణించినట్లు ఉందని చెప్పడంతో తాను కంగుతిన్నానని గూడూరు జడ్పీటీసీ సభ్యుడు మౌలాలి చెప్పారు.

విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దండి

కర్నూలు విద్య, క్రీడలు, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా చూడాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులపై ఉందని డీఈవో సుధాకర్ పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నగరంలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో శనివారం వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నారు. క్రీడా పోటీల్లో పతకాలు సాధిస్తే సులువుగా ప్రభుత్వ కొలువులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఏపీసీ లోకరాజు, డిప్యూటీ డీఈవో శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాల క్రీడాకారులు సాధించిన విజయాలను పరిగణనలోకి తీసుకొని క్రీడా ఎక్స్‌లెన్స్ అవార్డులను ప్రకటించారు. మీదివేముల జడ్పీ ఉన్నత పాఠశాల ప్రథమ, కర్నూలు మండలం మిలటరీ కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాల ద్వితీయ, పర్ల జడ్పీ ఉన్నత పాఠశాల తృతీయ బహుమతులు సాధించాయి. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, వ్యాయామోపాధ్యాయులు అవార్డులను అందుకున్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులతో విద్యాశాఖ అధికారులు

ఉపాధితోనే ఆర్థిక ప్రగతి : ఎమ్మెల్యే కేఈ

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబాలు ఆర్థిక ప్రగతి సాధించాలంటే చదువుకున్న యువత కాలం వృథా చేయకుండా ఉద్యోగ ఉపాధవకాశాలను అందిపుచ్చుకోవాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సూచించారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన మెగా ఉద్యోగ మేళాను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతమైన పత్తికొండ, చుట్టుపక్క ప్రాంతాల్లోని చదువుకున్న యువత ఉపాధి లేక ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఉద్యోగ ఉపాధవకాశాలు కల్పిస్తోందన్నారు. వివిధ విద్యార్హతలు ఉన్న అభ్యర్థులను ఆయా కంపెనీల ప్రతినిధుల ఎంపిక అనంతరం వారి మార్గనిర్దేశాల ప్రకారం విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. దూర ప్రాంతాలైనా సరే వచ్చిన ఉద్యోగావకాశాలను వదిలిపెట్టకుండా పనిచేసి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మాధురి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి పి.ప్రశాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మునగాల రామకృష్ణ, ఎన్‌సీసీ కల్నల్ పి.సూర్యచంద్ర, తెదేపా నాయకులు పి.శ్రీనివాసులు, బత్తిన లోక్‌నాథ్, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, పత్తికొండ సీఐ జయన్న, నైపుణ్యాభివృద్ధి సంస్థ పత్తికొండ సమన్వయకర్త సుధాకర్, కళాశాల అధ్యాపక బృందం, ఆయా కంపెనీల ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. మేళాకు మొత్తం 113 మంది హాజరు కాగా 43 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పరిశ్రమల్లో పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో చేపడుతున్న పరిశ్రమలు, ప్రాజెక్టుల పనుల్లో పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ డా.సిరి అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో పరిశ్రమల అభివృద్ధి, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అభివృద్ధి దిశలో ఉన్న 38 పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను సత్వరమే కల్పించాలన్నారు. ఏడు ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, టెండర్ల ప్రక్రియ, భూ కేటాయింపుల పురోగతిపై సమీక్షించారు. జిల్లాలో ఏర్పాటవుతున్న మెగా పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ, ఆర్ఏఎంపీ, ఐడీపీ 2024- 29 పారిశ్రామిక విధానం, ఒక కుటుంబం- ఒక పారిశ్రామికవేత్త తదితర పథకాల్లో పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సంజీవరాజు, ఏపీఐఐసీ జెడ్ఎం మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అధికారిణి పి.దీప్తి, ఎల్‌డీఎం మోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌పై స్పందన తెలియజేయండి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)పై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయడానికి ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌ను రూపొందించిందని కలెక్టర్ డా.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు దానిని చరవాణి ద్వారా స్కాన్‌చేసి తమ స్పందన తెలియజేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించి ప్రజల్లో సంతృప్త స్థాయిని మెరుగుపరచడం కోసం ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ద్వారా స్పందనలు తెలుసుకుంటోందని వెల్లడించారు.

గిడుగు రామ్మూర్తి సేవలు చిరస్మరణీయం



అష్టావధానంలో పాల్గొన్న కవులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : తెలుగుభాష అభివృద్ధి కోసం గిడుగు రామ్మూర్తి అందించిన సేవలు చిరస్మరణీయమని మాంటిస్సోరి విద్యా సంస్థల కరస్పాండెంట్ రాజశేఖర్ పేర్కొన్నారు. నగరంలోని ఎ.క్యాంప్‌లో ఉన్న మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా శనివారం అష్టావధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శతావధాని బులుసు అపర్ణ మాట్లాడుతూ కల్యాణమ్మ విద్యారంగానికి చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. శతావధాని బులుసు అపర్ణతో పాటు కవులు సుధాకర్‌శర్మ, గునుమాల మునిస్వామి, కె.చంద్రమౌళిని, పత్తి ఓబులయ్య, డాక్టర్ పార్వతీదేవి, నీలిమశర్మలను సత్కరించారు. అనంతరం గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

నృత్య వైభవం

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల కోసం దేవస్థానం కళారాధన నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన సుధా కల్చరల్ సొసైటీ బృందం సభ్యులు శనివారం పలు ఆధ్యాత్మిక గీతాలకు సంప్రదాయ నృత్యాలు చేశారు. కళాకారులకు దేవస్థానం అధికారులు ప్రసాదాలు అందజేసి సత్కరించారు.
– న్యూస్‌టుడే, సున్నిపెంట సర్కిల్, శ్రీశైలం

పుట్టినరోజు వేడుకల్లో ఘర్షణ

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: పుట్టినరోజు వేడుకల్లో..జన్మదినం చేసుకుంటున్న యువకుడిపై అతడి స్నేహితులు బీరు సీసాతో దాడి చేసిన ఘటన ఆదోని పట్టణంలో చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు..ఆదోని పట్టణం రాయనగర్‌కు చెందిన ఆంథోనీ అనే యువకుడు శుక్రవారం రాత్రి రాయనగర్ సమీపంలో తన జన్మదిన వేడుకలు జరుపుకొన్నాడు. ఈ వేడుకలకు వచ్చిన అతడి స్నేహితులు ఆకాశ్, అబ్దుల్లాలు రూ.1200 విషయంలో ఆంథోనీతో గొడవపడ్డారు. మాటామాటా పెరిగి ఆంథోనిపై ఆకాశ్, అబ్దుల్లాలు బీరుసీసాతో దాడి చేసి గాయపరిచారు. స్థానికులు గాయపడిన ఆంథోనిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తులు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్రీనివాస రెడ్డి, జస్టిస్ హరినాథ్ శనివారం దర్శించుకున్నారు. శ్రీమఠం అధికారులు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పీఠాధిపతుల నుంచి ఆశీర్వాదం, శేషవస్త్రం, ఫల మంత్రాక్షితలను అందుకున్నారు. సీఐ రామాంజులు వారికి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాఘవేంద్ర స్వామిని దర్శించుకుంటున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు

EENADU Classifieds

AUTO

VEHICLES WANTED

డోన్ పట్టణము నందు ప్రముఖ సెల్‌టవర్ కంపెనీకి Swift, Dzire Sedan వాహనము Yearly కాంట్రాక్ట్ కింద కావలయును. ✆73864 55779, 98661 21779

BUSINESS SERVICES

BUSINESS OFFER

FRANCHISEE OFFER in all Districts for International Tour Packages & 3 ★ Hotel Property Memberships. Con: 73868 88119.

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించికొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం., సెల్: 73821 14647

ఫ్రీ లాంచింగ్ ప్రొడక్ట్ బేస్‌డ్ ఇన్వెస్ట్‌మెంట్, బైనారి బిజినెస్ కాన్సెప్ట్ స్త్రీ/పు. నిరుద్యోగులు, MLM, మార్కెటింగ్ లీడర్స్ లక్షల్లో వీక్లీటీమ్ సంపాదన. ✆ 70132 03996.

FINANCIAL SERVICES

లేక్‌ల్యాండ్ కంపెనీ - అన్నిలోన్లు ప్రాపర్టీ, LAP, బిజినెస్, వ్యవసాయ, టేకోవర్ పర్సనల్, గ్రూప్ లోన్లు @ 7% వడ్డీ. ఏజెంట్లు కావలెను. మంచి కమీషన్. 89619 20779

ఆరోగ్యమే మహాభాగ్యం

HEALTH & CARE

PHYSICIAN

డా॥ G.కుషల్ ప్రసాద్, M.D., Gen., ఫిజిషియన్ & డయాబెటాలజిస్ట్, సత్యనారాయణ స్వామి గుడి వెనుక, గాయత్రి ఎస్టేట్స్, కర్నూలు. ✆ 99669 25324.

REAL ESTATE

FLAT FOR SALE

Flat for Sale. 2BHK, 1170 Sft. North, 3BHK, 1530 East Dhanalakshmi Nagar near Nandyal Check Post. ✆ 99597 59519.

కర్నూలు అశోక్ నగర్ 1030 Sft. 2 BHK ఫ్లాట్ అమ్మకానికి కలదు. మోక్షసాయి అపార్ట్ మెంట్. ఫోన్ సంప్ర: 93938 10725.

వెంకటరమణ కాలనీ కర్నూలు విజయలక్ష్మి పార్ర్యాన్ ఫ్లాట్ నెం: 102 ఫస్ట్ ఫ్లోర్ 2 BHK 1100 SFT. అమ్మబడును. సంప్ర: 95536 32756.

HOUSE FOR SALE

Kurnool - Semi Furnished N.E. Corner Independent House for Sale, GF 2 BHK 1st F 2 BHK,V R Colony, Road No: 5, Price 1.3 Crs. Contact: 98480 76508.

LAND FOR SALE

Tamilnadu Arunachala (Tiruvannamalai) 5.87 Acres Sale. Suitable for Ashrams, Institution, Farm Houses. ✆ 98406 51404.

Dhinnedevarapadu, kurnool, 1750 Sqft (4.03 Cents) Vacant Land Very Close to Byepass Road. No Brokers Only Buyers Cont. Agent Shankar Chennai 77084 17134.

WANTED

నంద్యాల చెక్ పోస్ట్ నుండి G.పుల్లారెడ్డి, పుల్లయ్య కాలేజి వరకు 100 ఫీట్ రోడ్డుకు 25 లక్షలు మెయిన్ రోడ్డు బిట్ కావలెను. Ph: 94400 62539.

PROPERTY FOR SALE

డోన్‌లో పాతబస్టాండ్, గాంధీచౌక్ కూరగాయల మార్కెట్ ఎదురుగా గల మూడంతస్తుల (G+3) హోటల్ శ్రీదుర్గకాంప్లెక్స్ అమ్మబడును. స్థలం సుమారు 2.19 సెంట్స్ బోర్‌వెల్, మున్సిపల్ వాటర్, 3 కరెంట్ మీటర్లు కలవు. సంప్ర: 94405 92943

TO LET

నంద్యాలరోడ్ వస్త్రాలయ షాపు వెనుక 2 BHK (1st ఫ్లోర్) 1BHK (2nd ఫ్లోర్) భరతమాత టెంపుల్ దగ్గర బాడుగకు కలవు. సంప్ర: 98852 91342, 63046 62560.

COMMERCIAL

మౌర్య ఇన్ ప్రక్కన పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రక్కన ఉన్న న్యూ లేజర్ ల్యాబ్ గల (భాగ్య నగర్) 1000 చ॥ అ॥ 1st ఫ్లోర్ షాపు అద్దెకు ఇవ్వబడును. ✆ 99663 22877.

గాయత్రి ఎస్టేట్ లో క్లినిక్/ ల్యాబ్ కొరకు బిల్డింగ్ సిద్ధంగా ఉంది. కావలసిన వారు సంప్రదించండి. Cell No: 99490 04007.

JOBS

కర్నూలు-టైల్స్ షోరూమ్ లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ గా పని చేయుటకు 10వ తరగతి ఆపైన చదివిన మేల్ & ఫీమేల్ ఎంప్లాయిస్ కావలెను. సంప్ర: 89855 52331.

కల్లూరు ఎస్టేట్ లో ప్రముఖ కెమికల్ ఫ్యాక్టరిలో అడ్మిన్ డిపార్ట్‌మెంట్ నందు పని చేయుటకు అనుభవజ్ఞులైన Operations Manager, Asst Operation Manager & అకౌంట్స్ మేనేజర్ కావలెను. కర్నూలు. 95818 27461, 63024 32657.

కర్నూలు నగరంలో ప్రముఖ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ లో పని చేయుటకు మహిళా వార్డెన్ కావలెను. జీతంతో పాటు వసతి సౌకర్యం కల్పించబడును. సంప్ర: 70132 31451.

కర్నూలు నగరం సీతారాం నగర్ నందు వంట చేయుటకు వంట మనిషి కావలెను. Contact: 94400 10427.

సుశీల నేత్రాలయ హాస్పిటల్ నందు పని చేయుటకు ఆప్టికల్స్ సేల్స్ పర్సన్ & O.P. అసిస్టెంట్ కావలెను. అర్హత: ఇంటర్. సంప్ర: 63000 82090.

ఆర్వి డిజిటల్స్ - తిరుపతి నందు పని చేయుటకు గ్రాఫిక్ డిజైనర్స్ (ఫోటోషాప్, కోరల్ డ్రా తెలిసినవారు), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 86880 56789.

వంశీ డయాబెటిక్ & మెటర్నిటీ హాస్పిటల్ నందు వర్క్ చేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. పూర్తి బయోడేటాతో మంగళవారం ఉ॥ 3 గం॥ హాజరు కాగలరు. గాయత్రి ఎస్టేట్, Knl. ✆ 95503 95178.

Exp. ఆయాలు / వార్డ్ బాయ్స్ నర్సులు కావలెను. జీతం: 21000/- నుండి 30,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. Ph: 80967 70770/ 99856 01234.

FACULTY/ TEACHERS

Wanted Lady Graduates to Teach Lower Classes Sri Sai High School. Nr. Sai BABA Temple, Dist Court, Knl. ✆ 98486 07343.

Wanted Trained & Experienced Teacher for Hindi & Computer Operator, KVR High School, Opp: Vaddegeri, Knl. ✆ 98660 01978.

Wanted Teacher's to teach Hindi Subject upto 7th Standard at Kurnool. Contact: 98661 79468.

Wanted Experienced Teachers to Teach 6th to 10th Social, Natural Science & Mathematics for Ramu EM School, Chinnatekur, Knl. ✆ 94400 79639.

Wanted EM Teachers for VIII to X Maths. Cont: Adithya School, Kallur. ✆ 08518-232596, 94901 30596.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రమాద కారకుడిని కఠినంగా శిక్షించాలి

☛ రోడ్డుపై మృతదేహంతో బంధువుల ఆందోళన

గూడూరు, గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలులోని కోడుమూరు రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎర్రన్న అనే వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ గూడూరులోని పాత బస్టాండు కూడలిలో అతని కుటుంబీకులు, బంధువులు శనివారం మృతదేహంతో ఆందోళన చేపట్టారు. గూడూరుకు చెందిన దేవదానం కుమారుడు ఎర్రన్న(40), పులకుర్తి గ్రామానికి చెందిన నాగరాజు శుక్రవారం ద్విచక్ర వాహనంపై కర్నూలు నుంచి స్వగ్రామాలకు బయలుదేరారు. బళ్లారి చౌరస్తా దాటిన తర్వాత ప్రైవేటు పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన వేగ నిరోధకం దాటేటప్పుడు వెనుక కూర్చున ఎర్రన్న అదుపుతప్పి కిందపడ్డారు. అదే సమయంలో వెనుక వస్తున్న మునగాల గ్రామానికి చెందిన ట్రాక్టర్ టైర్ అతని తలపైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కర్నూలు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతుని బంధువులకు సమాచారం ఇచ్చారు. శవపరీక్షలు నిర్వహించి మృతదేహం అప్పగించారు. సాయంత్రం మృతదేహంతో గూడూరుకు చేరుకుని అంత్యక్రియలు నిర్వహించకుండా ట్రాక్టర్ యజమాని మునగాలకు వెళ్తుండగా పోలీసులు గుర్తించి అడ్డగించారు. దీంతో దారిపై ఆందోళనకు దిగారు. ఎస్ఐ రాజకుళ్లాయప్ప సర్దిచెప్పినా వినకుండా సుమారు మూడు గంటల పాటు ఆందోళన చేపట్టడంతో 2 కి.మీ మేర వాహనాలు నిలిచిపోయాయి. సీఐ తబ్రేజ్ గూడూరుకు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. ప్రమాదానికి కారుకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం జరిగేలా చేస్తానని ఆయన హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ఎర్రన్న (పాత చిత్రం)

ఆందోళకారులతో మాట్లాడుతున్న సీఐ

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

ఘనంగా ఆంజనేయస్వామి ఉత్సవాలు

స్వామి విగ్రహాలను పల్లకిలో ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు

హొళగుంద, న్యూస్‌టుడే: మండల పరిధి లింగంపల్లి గ్రామంలో కొలువైన ఆంజనేయస్వామికి శ్రావణ మాసం మూడవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగింపు చేపట్టారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులను చెల్లించుకున్నారు. నేడు రథోత్సవ కార్యక్రమం జరుగుతుందని గ్రామపెద్దలు తెలిపారు.

కృష్ణగిరి, న్యూస్‌టుడే: కృష్ణగిరి మండలంలోని పెనుమాడ, పెద్దొడ్డి, కటారుకొండ, అమకతాడు, గ్రామాల్లో శనివారం శ్రీ ఆంజనేయస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల ఊరేగింపు నిర్వహించారు.

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు ధరలు

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం జరిగిన వ్యాపారంలో పలికిన వివిధ పంట దిగుబడుల ధరలు. పత్తి క్వింటాలు కనిష్ఠంగా రూ.4,419, గరిష్ఠంగా రూ.9,970. వేరుశనగ రూ.5,188-9,168, ఆముదాలు రూ.6,656-6,826లు పలికాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని మద్దమ్మబావిలో నీరు పచ్చగా మారింది. క్లోరినేషన్ చేయించాలి. **-ఖాజావలి, మద్దికెర.** ✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **-కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర.**

ఆస్పరి, న్యూస్‌టుడే: ?: ఆస్పరి నుంచి ఆదోనికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే జిల్లా పరిషత్తు పాఠశాల ఉంది. విద్యార్థులు పాఠశాలకు పోవాలంటే రహదారి దాటాల్సి వుంది. వాహనాలు వేగంగా తిరుగుతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశముంది. **-వీరశేఖర్, రామాంజనేయులు, ఆస్పరి** ✔: విషయాన్ని ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వేగ నిరోధకాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **-తిరుమలరావు, మండల విద్యాధికారి, ఆస్పరి**

రణమండల క్షేత్రాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ ఛైర్మన్

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారు కొండపై కొలువైయున్న రణమండల ఆంజనేయస్వామి క్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే డా.పార్థసారథి తెలిపారు. శ్రావణమాసం శనివారం పురస్కరించుకుని కొండపై ఉన్న స్వామి వారిని ఎమ్మెల్యే దర్శించుకొని, పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ టీజీ.పాండురంగయ్యశెట్టి ఎమ్మెల్యేను సన్మానించారు. స్థానిక నాయకులు మణికంఠ, ఉపేంద్ర, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాకుంభాభిషేక పూజలు: ఆదోని పట్టణంలోని అనంత మంగళ అంజనేయస్వామి ఆలయంలో శనివారం హోమ పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే డా.పార్థసారథితో నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆదివారం మహాకుంభాషేక పూజలు నిర్వహించనున్నారు.

వైభవంగా తనువు బిందెసేవ

హాలహర్వి, న్యూస్‌టుడే: చత్రగుడి ఆంజనేయస్వామి శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి స్వామి రథోత్సవం నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణంలో అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

వేడుకగా ఆరాధనోత్సవాలు

కోటఅశ్వర్థనగర్ (ఆదోని పాతపట్టణం), న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని మంత్రాలయం మఠం అనుబంధ ఆలయమైన కోట మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో మంత్రాలయం గురురాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేసి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజరు భీమ్‌రావు, విచారణకర్త నకాతే శ్యాంప్రసాద్, శ్రీధర్, అర్చకులు గురురాజాచార్ పాల్గొన్నారు.

అదుగో పులి.. గ్రామాల్లో గిలి

● కలవరపెడుతోన్న చిరుతల సంచారం ● అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆస్పరి మండలం తంగరడోణ కొండ ప్రాంతంలో ఇటీవల కనిపించిన చిరుత | ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని డివిజన్ పరిధిలోని కొండ ప్రాంతాల్లో ఇటీవల చిరుతపులుల సంచారం అధికమైంది. డివిజన్ పరిధిలోని కోసిగి, కౌతాళం, ఆస్పరి, ఆదోని మండలాల పరిధిలోని కొండ ప్రాంతాల్లో చిరుతలు సంచరిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు గుర్తించారు. కొన్ని ప్రాంతాల్లో చిరుతలు పశువులు, మేకలు, గొర్రెలు, కుక్కలు, కోతులపై దాడులకు పాల్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

❐ ఆదోని డివిజన్ పరిధిలోని ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాల్లోని కొండ ప్రాంతాల్లో ఇటీవల చిరుతల సంచారం అధికమవ్వడంతో ఆయా గ్రామాల ప్రజలు కలవరపడుతున్నారు. ఇటీవల ఆస్పరి మండలం తంగరడోణ గ్రామంలో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్థులు గుర్తించారు. దీంతో అటవీ శాఖ అధికారులు ఆ గ్రామానికి వెళ్లి ప్రజలకు పలు సూచనలు చేశారు.

చిరుతలు కనిపిస్తే ఈ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలి

సెక్షన్	అధికారి	ఫోన్ నంబరు
ఆదోని	ఎఫ్ఆర్‌వో	9398561626
ఆదోని	ఎఫ్ఎస్‌వో	7989142039
పత్తికొండ	డీఆర్‌వో	6281947686
ఆలూరు	ఎఫ్ఎస్‌వో	9441760376

అటవీ అధికారుల సూచనలివీ..

❐ చిరుతలు సంచరించే ప్రాంతాలకు ఒంటరిగా వెళ్లొద్దు. ఆయా ప్రాంతాలకు మేకలు, గొర్రెలు, పశువులను మేతకు తీసుకెళ్లొద్దు.

❐ చిరుతలు తిరుగుతున్న ప్రదేశాల్లో పొలాలుండే రైతులు అక్కడికి ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలి. అలికిడి, శబ్దాలు చేస్తూ సమూహంగా వెళ్లడం మంచిది.

❐ వన్యప్రాణులు తిరిగే ప్రాంతాల్లో వాహన చోదకులు వాహనాలు మెల్లగా నడపాలి. చిరుతలు కనిపిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.

❐ ప్రధానంగా చిరుత, జింకలు వంటి వన్యప్రాణులకు ఎవరైనా హాని కలిగిస్తే వన్యప్రాణి చట్టం 1972 కింద కేసులు నమోదు చేస్తారు.

❐ చిరుతల దాడిలో పశువులు చనిపోతే సంబంధిత యజమానులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదు అందిన వెంటనే అటవీ శాఖ అధికారులు పశుసంవర్ధక శాఖ వైద్యుడిని ఘటనాస్థలానికి తీసుకొచ్చి చనిపోయిన జంతువులకు పోస్టుమార్టం నిర్వహిస్తారు. అనంతరం మార్కెట్ విలువ ఆధారంగా అటవీశాఖ యజమానికి నష్టపరిహారం అందజేస్తుంది.

చిరుత కనిపిస్తే సమాచారమివ్వండి

-తేజశ్వి, అటవీ శాఖ రేంజ్ అధికారిణి, ఆదోని

ఆదోని డివిజన్ పరిధిలో ఇటీవల చిరుతల సంచారం అధికంగా ఉంది. ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. చిరుతలు కనిపిస్తే వెంటనే అటవీ శాఖ లేదా పోలీసు శాఖ లేదా సచివాలయ సిబ్బందికి సమాచారం అందించాలి. చిరుతల సంచారంపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పరిస్థితులను పర్యవేక్షిస్తున్నాం.

హాకీ విజేత జీఎస్ఆర్ ఉన్నత పాఠశాల

పతకాలు, కప్పును ప్రదర్శిస్తున్న విజేత జట్టు

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఆదోని పీఈటీఎస్ అండ్ ఎస్‌ఏ పీఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీల్లో ఆదోని జీఎస్ఆర్ ఉన్నత పాఠశాల హాకీ జట్టు విజేతగా నిలిచినట్లు పాఠశాల కరెస్పాండెంట్ గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం గెలుపొందిన జట్టు క్రీడాకారులకు ఆయన అభినందనలు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు, క్రీడాకారులు, విద్యార్థులు

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడల్లో రాణించడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవరుతాయని ఆదోని డివిజన్ ఉప విద్యాధికారి రాజేంద్రప్రసాద్, ఆదోని తాలుకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విట్టా రమేశ్ అన్నారు. ఆదోని పట్టణంలో ఏపీ పీఈటీస్ అండ్ ఎస్‌ఏ పీఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు, ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దకడబూరు విద్యాధికారి రామమూర్తి, విశ్రాంత విద్యాధికారి భూపాల్‌రెడ్డి, నాగరాజు, మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడాకారులు పాల్గొన్నారు.

తాగునీటికి.. బోరుమంటున్నారు!

కారుమంచి గ్రామంలోని జిల్లా పరిషత్తు పాఠశాలలో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ బడిలో బోరు మరమ్మతులకు గురైంది. విద్యార్థులు దాహార్తి తీర్చుకోవడానికి ఇళ్ల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. కొందరు హంద్రీవాగు ద్వారా వచ్చే నీటితోనే దాహార్తి తీర్చుకుంటున్నారు. పాఠశాలలో ఆర్వో ప్లాంటు సైతం లేదు. అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు నిర్వహించి, ఆర్వో ప్లాంటును మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆస్పరి

పట్టించుకోకుంటే.. తప్పదు ప్రమాదం

ఈ చిత్రంలో కనిపిస్తున్న నీటి ట్యాంకు హాలహర్వి మండలం సాకిబండ గ్రామంలోనిది. ఇది నిర్మించి దశాబ్దలవుతుంది. ఇదే ట్యాంకు నుంచి గ్రామానికి తాగునీరు సరఫరా జరుగుతుంది. ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో అధికారులు పర్యటించిన ప్రతీసారి నూతన ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్న పట్టించుకోనే వారు కరవయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన ట్యాంకు పడగొట్టి ప్రమాదం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, హాలహర్వి

కబడ్డీ పోటీల్లో విజేతగా గోనెగండ్ల జట్టు

పెద్దొడ్డి,(కృష్ణగిరి), న్యూస్‌టుడే: మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో ఆంజనేయస్వామి పండగ సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతగా గోనెగండ్ల జట్టు నిలిచింది. మొత్తం 23 జట్లు పాల్గొన్న పోటీల్లో విజేతగా గోనెగండ్ల జట్టు నిలిచింది. తర్వాతి స్థానాల్లో సిద్ధనగట్టు, వి.బొంతిరాళ్ల, కోడుమూరు జట్లు నిలిచాయి. వారికి వరుసగా మొదటి బహుమతి రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు అందజేశారు. ◆ ఆదివారం వృషభరాజులకు బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

విజేత జట్టు ఆనందహేళ

చేతి వృత్తిదారులను ఆదుకోవాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా వివిధ చేతి వృత్తులు చేస్తున్నవారిని ప్రభుత్వం ఆదుకోవాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సి.పెద్దయ్య కోరారు. చేతివృత్తుల వారికి ప్రభుత్వం చేయూతనందించాలని కోరుతూ శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 50 ఏళ్లు నిండిన చేతి వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలని, ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి యు.కారుమంచి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

పట్టుసాగుకు రైతులు ఆసక్తి చూపాలి

దేవనబండ, నలకదొడ్డి(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: పట్టుసాగుపై రైతులు ఆసక్తి పెంచుకోవాలని పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి ఐ.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని దేవనబండ, నలకదొడ్డి గ్రామాల్లో శనివారం పట్టుసాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

బీసీల ద్రోహి జగన్

మాట్లాడుతున్న రుద్రకోటి సదాశివం

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బీసీలను జగన్మోహన్‌రెడ్డి దగా చేశారని నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ రుద్రకోటి సదాశివం తెలిపారు. శనివారం సాయంకాలం ఆదోని పర్యటనకు వచ్చిన ఆయన మాట్లాడారు. రాజకీయ పదవులకు బీసీలను దూరం చేసిన ఘనత జగన్‌దేనన్నారు. కూటమి ప్రభుత్వం బీసీల భద్రతకు చట్టం తీసుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ డైరక్టరు రంగస్వామి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ధార శ్రీ పత్తి పరిశ్రమకు ఉత్తమ సేవల అవార్డు

కేంద్రమంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న వెంకట్రామిరెడ్డి, ఆదినారాయణరెడ్డి

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ధార శ్రీ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పత్తి పరిశ్రమ కేంద్రప్రభుత్వం నుంచి ఉత్తమ సేవల అవార్డు అందుకున్నట్లు పరిశ్రమ భాగస్వాములు శనివారం తెలిపారు. ఈ నెల 22న ముంబాయి టెక్స్‌టైల్స్ కార్యాలయంలో కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ చేతుల మీదుగా ధార శ్రీ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పత్తి పరిశ్రమ మేనేజింగ్ భాగస్వాములు వెంకట్రామిరెడ్డి, ఆదినారాయణరెడ్డి ఈ అవార్డు అందుకున్నారు.

◆ మార్కెట్లో కొత్త రకం పత్తి విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చి పత్తి సాగును లాభసాటి చేయాలని టెక్స్‌టైల్స్ శాఖ కమిటీ సభ్యులకు వినతి పత్రం అందించినట్లు ఆదోని పత్తి వ్యాపార సంఘం కార్యదర్శి వెంకట్రామిరెడ్డి శనివారం తెలిపారు.

పిఠాపురం ఘటనపై నోరువిప్పాలి

మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: పిఠాపురం ఘటనపై రాష్ట్రంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు నోరువిప్పి మాట్లాడాలని విశ్వ హిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనలో ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు కారకుడైన సాదిక్‌ను కఠినంగా శిక్షించాలని ఆర్డీవో కార్యాలయంలో శనివారం వారు వినతిపత్రం అందించారు. నాయకులు ఎగ్గటి ప్రతాప్, పొంపాపతి, కునిగిరి నీలకంఠ, శ్రీనివాసులు, శ్రీనివాసాచారి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారు శిరుగుప్ప కూడలి సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు..ఆదోని మండలం సంతేకూడ్లురు గ్రామానికి చెందిన శంకరస్వామి, ఇంగళదహాలు గ్రామానికి చెందిన వీరభద్రయ్య ద్విచక్ర వాహనంపై సంతేకూడ్లురు వైపు వెళుతుండగా కుక్క అడ్డం రావడంతో అదుపుతప్పి కిందపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. శంకరస్వామి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించాలని ఆదోని వైద్యులు సూచించారు.

◆ పట్టణానికి చెందిన శ్రీకాంత్ తిరుమలనగర్ సమీపంలో బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌కు గాయాలవ్వగా స్థానికులు అతడిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్, ఈగల్ టీం సభ్యులు

దేవనకొండ, న్యూస్‌టుడే: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ వేణుగోపాల్, ఈగల్ సభ్యులు రమేష్ సూచించారు. శనివారం దేవనకొండ, వెలమకూరు గ్రామాల్లో డ్రగ్స్ వినియోగంతో వచ్చే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు చెన్నయ్య, ప్రదీప్, బాబునాయక్, చంద్రశేఖర్, రంగన్న పాల్గొన్నారు.

మాతృభాషను గౌరవించాలి

కుంకనూరు: తెలుగు వరుసలో కూర్చున్న విద్యార్థులు

దేవనకొండ, న్యూస్‌టుడే: తెలుగుభాషను గౌరవించాలని, మాతృభాషను మరవరాదని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కుంకనూరులోని ఉన్నత పాఠశాలలో తెలుగుభాష దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు తెలుగు భాషను పరిరక్షించిన మేధావులు, కవులు, రచయితలు, సాహిత్య కళాకారుల చిత్ర పటాలను ప్రదర్శించారు. విద్యార్థులు కవుల చిత్రాలను ప్రదర్శించారు.

గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్‌లకు ఘన నివాళి

ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తెలుగు భాషా, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

ఏఐకేఎంఎస్ మహాసభలను జయప్రదం చేయండి

ఆదోనిలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతపురంలో వచ్చే నెల 11, 12 తేదీల్లో జరుగు అఖిల భారత రైతు కార్మిక సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ కోరారు. ఆదోనిలో శనివారం అందుకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప, నేతలు నరసన్న, బసవరాజు, ప్రగతి శీల మహిళ సంఘం జిల్లా కార్యదర్శి మణి తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తులవారిని ఆదుకోవాలని ధర్నా

ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న నాయకులు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: చేతివృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నవారిని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆదోని పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు చేతివృత్తుదారుల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కారన్న, , కల్లుబావి రాజు, సుదర్శన్, యల్లప్ప, లక్ష్మిరెడ్డి, గంగన్న, భీమేశ్, శేషన్న, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాష..క్రీడా దినోత్సవాలు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని పాఠశాలల్లో శనివారం తెలుగు భాష, క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు అభ్యున్నతికి, క్రీడాభివృద్ధికి వారు చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఆదోని పట్టణంలోని భాష్యం ఉన్నత పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

హొళగుంద, న్యూస్‌టుడే: మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా, క్రీడా దినోత్సవం సందర్భంగా గిడుగు రామమూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు ప్రధానోపాధ్యాయుడు కబీర్‌సాబ్, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దొడ్డబసప్ప, శాంతమూర్తి, బీటీ కలందర్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌కు పక్కాగా ఏర్పాట్లు చేయండి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: నీట్‌పీజీ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పక్కాగా చేయాలని డ్వామా పీడీ నరసింహారెడ్డి అన్నారు. ఆదోని మండలం ధణాపురం సమీపంలోని బీమా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే నీట్ పీజీ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను శనివారం డ్వామా పీడీ నరసింహారెడ్డి పరిశీలించారు. ఆదోని ఉప తహసీల్దారు బాబు, అధికారులు పాల్గొన్నారు.

పోటాపోటీగా పత్తి పొలంలో గుంటక

నారాయణపురం(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో పోటాపోటీగా పత్తి పొలంలో రైతులు గుంటక పాస్తున్నారు. నారాయణపురం గ్రామవాసి బంగి మల్లేశ్‌కు చెందిన ఎద్దులు శనివారం 17 ఎకరాల పత్తి పొలంలో 12 గంటల సమయంలో గుంటక పాసి ప్రతిభ కనబరిచాయి. ఈ సందర్భంగా గ్రామంలో తప్పెట్లు, డప్పులతో ఎద్దులు, రైతుకు సన్మానం చేసి, ఊరేగించారు

మద్దికెరలో సాహితీ పోటీల నిర్వహణ

మద్దికెర విద్యాసాయి పాఠశాలలో వివిధ వేషధారణల్లో బాలికలు

మద్దికెర, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మద్దికెరలోని విద్యాసాయి పాఠశాలలో పోటీలు నిర్వహించారు. స్థానిక పాఠశాలలో శనివారం క్రీడలతో పాటు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సాహితీ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు వెంకట మాధవ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమరం.. అధికారులు సన్నద్ధం

❐ ఎన్నికల ఏర్పాట్లలో సిబ్బంది నిమగ్నం ❐ కొనసాగుతున్న ఓటర్ల గుర్తింపు ప్రక్రియ

పత్తికొండ మండల పరిషత్తు కార్యాలయం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేయటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తాజాగా ఓటర్ల గుర్తింపుకు ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసింది. దీంతో అధికారులు ఆయా మండలాల్లోని మొత్తం గ్రామ పంచాయతీలు, వార్డులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను గుర్తించి ప్రత్యేకంగా మార్కింగ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆ మేరకు అధికారులు, సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఓటర్ల ప్రారంభ జాబితాల ముసాయిదాలను ఆయా గ్రామ పంచాయతీలు, పట్టణాల్లోని ప్రధాన కార్యాలయాల్లో ప్రదర్శించారు. వీటిపై ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించి 29, 30, 31 తేదీల్లో పరిశీలన చేసి సెప్టెంబర్ 2న తుది జాబితా తయారు చేస్తారు. సెప్టెంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి ఈ జాబితాలను ధ్రువీకరిస్తారు. తుది ఎన్నికల జాబితా 7న ప్రకటిస్తారు.

మొత్తం వార్డుల్లోని ఓటర్ల సంఖ్యను బట్టి దాదాపుగా ప్రతి వార్డుకు ఒక్కో పోలింగ్‌స్టేషన్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వార్డులో 650 ఓటర్లను మించితే అదనంగా మరో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది.

పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని గ్రామ పంచాయతీలు, వార్డులు, పోలింగ్‌స్టేషన్లు తదితర వివరాలిలా ఉన్నాయి.

రెవెన్యూ డివిజన్:	పత్తికొండ
మొత్తం మండలాలు:	9
గ్రామ పంచాయతీలు:	155
మొత్తం వార్డులు:	1625
పోలింగ్ స్టేషన్లు:	1652
మొత్తం ఓటర్లు:	3,93,277
పురుషులు:	1,95,792
స్త్రీలు:	1,97,428
ఇతరులు:	57

సౌకర్యాల కల్పనకు అధికారుల చర్యలు

ఎన్నికలు జరిగే నాటికి అన్ని పోలింగ్ బూతుల్లో విద్యుత్తు, దీపాలు, పంకాలు, వెలుతురు ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వర్షం వచ్చినా, విద్యుత్తుకు అంతరాయం ఏర్పడినా పోలింగ్ నిర్వహణకు ఆటంకం కలగకుండా, బ్యాలెట్ బాక్స్‌లకు ఇబ్బందులు లేకుండా మెరుగైన సదుపాయాలు ఉండే పాఠశాలలు, సామాజిక భవనాలను ఎంపిక చేస్తున్నారు.

ముసాయిదా జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

ఓటర్ల గుర్తింపు కొనసాగుతోంది -శివశంకర్, డీఎల్‌పీవో, పత్తికొండ

ఇప్పటికే తొలిదశ ఓటర్ల జాబితాల ముసాయిదాలను ఆయా గ్రామాల్లో ప్రదర్శించాం. మరోవైపు ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేశాం. అవసరమైనన్ని బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను గుర్తించి మార్కింగ్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచండి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ నరసింహారెడ్డి అన్నారు. ఆదోని ఉపాధి కార్యాలయంలో శనివారం సాయంత్రం వీబీజీ రాంజీ పథకంపై ఆదోని ఉప డివిజన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆదోని డ్వామా ఏపీడీ లోకేష్, ఆదోని, కౌతాళం, కోస్గి, పెద్దకడబూరు ఏపీవోలు, ఈసీ, టీఏలు పాల్గొన్నారు.

ఆదోని తహసీల్దారుగా వేణుగోపాల్‌రావు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని తహసీల్దారుగా వేణుగోపాల్‌రావును నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదోనిలో ప్రస్తుతం పనిచేస్తున్న తహసీల్దారు శేషఫణి 15 రోజుల పాటు సెలవులో వెళ్లారు. దీంతో కోస్గి తహసీల్దారుగా పనిచేస్తున్న వేణుగోపాల్‌రావును ఆదోని(ఎఫ్ఏసీ) తహసీల్దారుగా నియమించారు.

(c) eenadu

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

శ్రీమఠంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

మంత్రాలయం న్యూస్‌టుడే: రాఘవేంద్ర స్వామి 355వ ఆరాధన ఉత్సవాల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని ఏఏవో మాధవ శెట్టి, మఠం పీఆర్వో నరసింహమూర్తిలను ఆయన ఆదేశించారు. భక్తుల కోసం కల్పించిన వసతుల గురించి మఠం పీఆర్వో ఎస్పీకి వివరించారు. ఆయన వెంట సీఐలు రామాంజనేయులు, దస్తగిరిబాబు, ఎస్సై మల్లికార్జున తదితర పోలీసు అధికారులు ఉన్నారు.

కూలీలకు పని కల్పించాలి

సి.బెళగల్, న్యూస్‌టుడే: ప్రతి గ్రామపంచాయతిలో సోమవారం నుంచి ఉపాధి పనులు ప్రారంభించాలని ఏపీడీ పద్మావతీ పేర్కొన్నారు. సి.బెళగల్ ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఏపీవో రామన్న అధ్యక్షతన డ్వామా సిబ్బంది నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడారు. పని కోరిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: మిలటరీ కాలనీలో విద్యుత్తు దీపాలు లేక చీకట్లో ఉంటున్నాం. - **శంకరయ్య, కాలనీవాసి,** సమాధానం: కొత్త వీధి దీపాలు అమర్చుతాం. - **నీరజ, డీఈఈ, ?:** లక్ష్మణ్‌టాకీస్ సమీపంలో కాల్వలు లేక మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. - **రంగన్న, స్థానికుడు, ✓:** కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తాం. - **గంగిరెడ్డి, పురపాలక కమిషనర్ ?:** చాకలి వీధిలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - **లక్ష్మి, కాలనీవాసి ✓:** పరిశీలించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం. - **నీరజ, డీఈఈ**

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండల పరిధిలోని హులికన్వి గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి పూట వృద్ధులు, చిన్నారులు బయటికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. - **మాదేవ, హులికన్వి ✓:** గ్రామంలో నూతన వీధి దీపాలు ఏర్పాటు వేయించి సమస్య పరిష్కరిస్తాం. - **ప్రభావతి దేవి, ఎంపీడీవో**

సి. బెళగల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: ముడుమాల 1వ వార్డులో దారులపై నిలిచిన మురుగు దోమలకు నిలయంగా మారింది. - **శేఖర్, ముడుమాల, ?:** పోలకల్లులోని 5వ వార్డులో మునగాల దారి వెంట మురుగు కాలువలు నిర్మించాలి. - **రాముడు, పోలకల్లు, ✓:** పంచాయతీ కార్యదర్శికి సూచించి రోడ్డుపై నిలిచిన మురుగు తొలగింపజేస్తాం. కాల్వల నిర్మాణానికి నివేదికలు సిద్ధం చేస్తాం. - **రాణెమ్మ, ఎంపీడీవో.**

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం

హనుమాపురంలో పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఈరన్న

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెదేపా సీనియర్ నాయకుడు ఈరన్న పేర్కొన్నారు. ఇంటింటికి తెదేపా కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మండల పరిధిలోని హనుమాపురంలో పర్యటించారు. ప్రభుత్వ రెండేళ్ల పాలనా విజయాలను ప్రజలకు వివరించారు. గ్రామ తెదేపా నాయకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల, న్యూస్‌టుడే: తెదేపా పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని తెదేపా మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు పేర్కొన్నారు. శనివారం అగ్రహారం గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శివభూషణంరెడ్డి, లింగన్న, రాముడు, రామలింగడు, ప్రతాపరెడ్డి, జిలాని, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారంలో ప్రభుత్వ పథకాల అమలు గురించి వివరిస్తున్న తెదేపా మండల కన్వీనర్

అక్రమాలకు వత్తాసు పలికారు

◆ ఉపాధి పనులు బాగా జరిగాయని అధికారుల కితాబు

ఎమ్మిగనూరు గ్రామీణం, ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఉపాధి రామ్‌జీ పనుల్లో అడుగడుగునా అక్రమాలే కానవస్తున్నాయి. శనివారం ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీపై స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృందం పలు అక్రమాలను గుర్తించినట్లు వెల్లడించారు. ఏ గ్రామంలోనూ కూలీలకు వంద రోజులు పని కల్పించలేదు. కొందరు పనులకు రాకున్నా వేతనాలు ఇచ్చినట్లు నిగ్గు తేల్చారు.

కాల్వలు, చెక్‌డ్యాంలు వంటి చోట్ల పూడికతీత పనులు దస్త్రాల్లో చూపిన కొలతలకు క్షేత్రస్థాయిలో తేడాలు బయటపడ్డాయి. మస్టర్లను సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో తనిఖీ చేయకుండా మొక్కుబడిగా కానిచ్చారు. ఇలా పలు అక్రమాలు జరిగినా జిల్లా స్థాయి అధికారులు మండలంలో బేష్‌గా పనులు జరిగాయని చెప్పడం గమనార్హం.

సామాజిక తనిఖీ ప్రజావేదికలో అంశాలను వివరిస్తున్న తనిఖీ బృంద సభ్యుడు, పాల్గొన్న అధికారులు

రూ.9,370 రికవరీకి ఆదేశం

మండలంలోని 2025-26 సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ పథకం రూ. 4.30 కోట్లు, గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 3.37 కోట్లు, సోషల్ ఫారెస్ట్ కింద రూ. 5 లక్షలు కలిపి మొత్తం రూ. 7.72 కోట్ల పనులు చేశారు. వీటిలో సామాజిక బృందం పలు అక్రమాలను గుర్తించి గ్రామ సభలు నిర్వహించినా.. చాలా సభలకు అబ్జర్వర్లు హాజరుకాలేదు. రూ.కోట్లలో అక్రమాలు జరిగినా కేవలం రూ. 9,370 రికవరీకి ఆదేశించి, రూ. 2,500 జరిమానా విధించారు. పండ్ల తోటల కింద రూ. 4.77 లక్షల విలువైన రీ ప్లాంటేషన్ చేయాలని ఆదేశించారు.

అవకతవకల్లో కొన్ని..

- గుడేకల్‌లో వంద రోజుల పని కల్పించలేదు. చేసిన పనులకు సంబంధించి బోర్డులు పెట్టలేదు. నీటి తొట్టెకు సంబంధించి ఫేక్ మస్టర్ ఇచ్చినట్లు సామాజిక బృందం సభ్యులు వెల్లడించారు. కూలీలకు సంబంధించి ఇద్దరి సంతకాలు ఒకరే చేశారు.
- పార్లపల్లిలో పనులకు సంబంధించి బోర్డులు పెట్టలేదు. జాబ్‌కార్డులు కొందరివే అప్‌డేట్ చేశారు. మస్టర్‌లో సంతకం లేకుండా వేతనం ఇచ్చారు. ఫీడర్ ఛానల్ పనుల్లో కొలతల్లో తేడాలు బయటపడ్డాయి. ఫారంపాండ్ క్షేత్రస్థాయిలో లేదు.
- పెసలదిన్నెలో మస్టర్లు తనిఖీ చేయడం లేదు. చెడ్‌డ్యాంల పూడికతీత పనుల్లో 86 క్యూబిక్ మీటర్లు కొలతల్లో తేడా వచ్చింది. ఫారంపాండ్ తవ్వి బిల్లు చేసుకొని పూడ్చేశారు. పొలంలో ఒక్క పండ్ల మొక్క కనిపించలేదు. సచివాలయం కిటికీలకు బిల్లులు చేశారు కానీ అక్కడ కిటికీల్లేవు. కోటేకల్, దేవిబెట్ట, బోడబండ, కందనాతి, కడివెళ్ల తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు తనిఖీ బృందం సభలో నివేదించింది.

నందవరం జడ్పీ పాఠశాలకు క్రీడా ప్రతిభ అవార్డు

నందవరం: కర్నూలు జిల్లా విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నందవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు క్రీడా ప్రతిభ అవార్డు-2026 లభించింది. పాఠశాల విద్యార్థుల క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ సాధించిన విజయాలకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేశారు. అనంతరం డీఈవో సుధాకర్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ కృష్ణ పాఠశాల హెచ్ఎం రామకృష్ణమరాజు, వ్యాయామోపాధ్యాయులు ఉమాపతి, అబ్దుల్ లతీఫ్, సూరజ్‌లను సత్కరించారు.

రహదారి శిథిలం.. ప్రయాణం నరకం

పట్టణంలోని ఎద్దుల మార్కెట్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు రహదారి శిథిలమై గుంతలు పడ్డాయి. తారురోడ్డు చాలా వరకు లేచిపోయి రూపు కోల్పోయింది. ఈ రహదారి గుండా నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనాలు వంటివి 5 వేలు తిరుగుతాయి. ఆదివారం పశువుల సంత కోసం ఈ రహదారి రద్దీగా ఉంటుంది. రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు నేరవార్తలు

తాళాలు తెరుస్తారు.. అధికారులు కానరారు

స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండటం లేదు. వారం రోజులుగా మధ్యాహ్నం 12, ఒంటి గంట సమయంలో కూడా కార్యాలయంలో కానరావడం లేదు. దీంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. ఎల్‌నినో ప్రభావంతో పంటలు తీవ్రంగా నష్టపోతున్న రైతులకు సూచనలు కరవవుతున్నాయి. రైతు సేవా కేంద్రం సిబ్బంది రోజువారీగా ఒకరు వచ్చి కార్యాలయాన్ని తెరిచి, విధులకు వెళ్తున్నట్లు సిబ్బంది చెప్పారు. ఏడీఏ కూడా ఇటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. అధికారులు అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నందవరం

వెలగని వీధి దీపాలు

ఎమ్మిగనూరు పట్టణంలో నిత్యం వీధుల్లో దీపాలు వెలగక చీకట్లో మగ్గాల్సిన పరిస్థితి నెలకొంటోంది. హెచ్‌బీఎస్ కాలనీ, సాయి నగర్ కాలనీల్లో వీధి దీపాలు వారానికోసారి మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రధానంగా విద్యుత్తు బోర్డుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కాలనీలల్లో అంధకారం నెలకొంటోంది. శనివారం రాత్రి పలు కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో తరచూ ఇవే సమస్యలు పునరావృతమవుతున్నాయి. ఉన్నతాధికారులు చొరవ చూపి స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు



అవార్డుల ప్రదానం

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి మఠం యోగీంద్ర కళామండపంలో రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన మంత్రాలయం ఎస్జీఎస్ విద్యాపీఠం ప్రిన్సిపల్ విద్వాన్ డా. ఎన్. వాదిరాజాచార్యతో పాటు, తమిళనాడు రాష్ట్రం తంజావూర్ శాస్త్ర యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఎస్. వైద్య సుబ్రహ్మణ్యంకు అవార్డులను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాధవశెట్టి, ఎస్. కే. శ్రీనివాస్ రావు, పీఆర్వో ఐపీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.


ప్రముఖులకు అవార్డులు అందజేస్తున్న సుబుదేంద్రతీర్థులు

తెలుగు భాష సంప్రదాయాలకు ప్రతీక

గూడూరులోని జ్యోతి ఉన్నత పాఠశాలలో తెలుగు పదం ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

గోనెగండ్ల: భువన విజయం నాటకంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

పెద్దకడబూరులో బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

తెలుగు భాషా దినోత్సవాన్ని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళి అర్పించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గ్రాంథిక భాషలో ఉన్న కఠినమైన చదువులను సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా వ్యావహారిక భాషను నడిపిన మహనీయుడని కొనియాడారు.

– న్యూస్‌టుడే, కోసిగి, పెద్దకడబూరు, గూడూరు గ్రామీణం, గోనెగండ్ల, కోడుమూరు గ్రామీణం, సి.బెళగల్

కోడుమూరు గ్రామీణం: వేషధారణలో ర్యాలీగా వెళ్తున్న లాగూర్ పాఠశాల విద్యార్థులు

కోసిగి: గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పల్లెపాడు రామిరెడ్డి తదితరులు

వైభవంగా సంతాన నాగమ్మ ప్రభోత్సవం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో వెలసిన సంతాన నాగదేవత 29వ ప్రభోత్సవం శనివారం వైభవంగా సాగింది. ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారి విశేషపూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పట్టణంలోని ప్రధాన రహదారి గుండా మేళతాళాలతో ప్రభోత్సవం సాగింది. ఊరేగింపులో కర్ణాటక డప్పు కళాకారుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ ఆవరణలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఎస్సై రాజకుళ్లాయప్ప ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఊరేగింపులో డప్పు కళాకారుల ప్రదర్శన

ఘనంగా సద్గురు శివరామావధూత ఆరాధనోత్సవం

ఆధ్యాత్మికం

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: కౌతాళం మండలంలోని కామవరం గ్రామంలో వెలసిన సద్గురు శివరామావధూత 82వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు నిర్వహించారు. ప్రస్తుత పీఠాధిపతి అవ్యక్తానంద సరస్వతి స్వామివారికి భక్తులు నాణేలతో తులాభారం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీఠాధిపతి

సీతారాముల పల్లకి ఉత్సవం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రామస్వామి దేవాలయంలో ఉప్పర సంఘం అధ్యక్షుడు యుకే వీరేంద్ర ఆధ్వర్యంలో సీతారాముల పల్లకోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగించి వెంకటాపురం శ్రీ గుంటి రంగనాథస్వామి ఆలయానికి చేర్చారు. అక్కడి నుంచి ఆలయానికి పల్లకోత్సవం నిర్వహించారు.

భక్తుల సుభిక్షం కోసమే వరుణ, శాంతి హోమం

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామి ఆలయంలో నిత్యం యాగశాలలో ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి వరుణ, శాంతి యాగం నిర్వహిస్తున్నారు. ప్రజలు, సుభిక్షంగా ఉండాలంటూ నెల రోజుల పాటు ఈ యాగం చేస్తున్నారు. వర్షం కురిసి, పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

హోమం చేస్తున్న ఆలయ డిప్యూటీ కమిషనర్

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కోడుమూరులో కోట్ల సర్కిల్ శనివారం న్యాయవాదులు నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఈ నిరసనకు కార్మిక సంఘం నాయకులు మద్దతు తెలిపారు. నిరసనలో కె. సోమేష్, బీసీ రాజు, కురుమన్న, రవికుమార్ యాదవ్, మధుయాదవ్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తాగునీటి సమస్య పరిష్కారానికి అడుగులు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరులో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ ఎల్లప్ప నాయుడు తదితరులు జీడీపీ జలాశయాన్ని, కోడుమూరు కొండపై నీటి పథకం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. వైస్ ఛైర్మన్ మాట్లాడుతూ కేడీసీసీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరి.. కోడుమూరులో నీటి సమస్య పరిష్కారానికి రూ. 39 కోట్లు మంజూరు చేయించారన్నారు. త్వరలో పనులు మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. వారి వెంట ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అబ్దుల్ ఖాదర్, మహబూబ్‌ఖాన్, ఉన్నారు.


గాజులదిన్నె జలాశయాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ, తెదేపా నాయకులు

వర్షం కురవాలని తిమ్మప్ప స్వామికి పూజలు

కోసిగి, న్యూస్‌టుడే: వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని కోసిగి కొండపై వెలసియున్న తిమ్మప్ప స్వామికి ప్రజలు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. యువకులు జట్లుగా ఏర్పడి కొండపైకి బిందెలతో జలం తీసుకెళ్లి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. అలాగే కోసిగయ్య, ఈశ్వరుడు, మారెమ్మ, సుంకుళమ్మ, కాలేశ్వరి దేవి, ఇతర దేవతలకు జలాభిషేకం చేశారు.

పూజలు అందుకున్న తిమ్మప్ప స్వామి

పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్‌లో రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో2 ఆదమ్‌భాషా పరిశీలించారు. భోజన నాణ్యత సరిగా లేకపోవడంపై సిబ్బందిని హెచ్చరించారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: బసలదొడ్డిలో ఉన్న పైరాఆంజనేయ స్వామి రాతి శిల ముఖ ద్వార నిర్మాణానికి ఆదోనికి చెందిన భక్తుడు రాము రూ. 10 వేలు, హనుమంతు రూ. 5 వేలు, ఈరన్న రూ. 2500, దలాలి అంగడి అజయ్ రూ. 5 వేల విరాళం అందించినట్లు ఆలయ అర్చకులు రామకృష్ణ స్వామి తెలిపారు.

విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలి

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని దళితవాడ శివారు కాలనీలో విద్యుత్తు సంభాలు ఏర్పాటు చేయాలని బాధితులు శనివారం మండల ఏఈ నారాయణ స్వామికి వినతిపత్రం సమర్పించారు.

సృజనాత్మక విద్యపై అవగాహన పెంపొందించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈవో-2 మధుసూదన్‌రాజు పేర్కొన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మాజీ సర్పంచి మృతికి సంతాపం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని దేవిబెట్ట మాజీ సర్పంచి వెంకట్రామిరెడ్డి(65) శనివారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆయన మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి పూర్వారాధన

కొత్తకోట (సి.బెళగల్), న్యూస్‌టుడే: రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా కొత్తకోట గ్రామంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించి తరించారు.

బ్యాటు పట్టి.. పరుగుల మోత మోగించి

● ఏటీబీపీఎల్ పోటీలకు ఎంపికైన చేనేతపురి విద్యార్థులు

ఎమ్మిగనూరు విద్యార్థులు క్రికెట్‌లో మెరుపులు మెరిపిస్తున్నారు. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహం తోడుగా బ్యాటింగ్, బౌలింగ్‌లో తమదైన ప్రతిభ చూపిస్తున్నారు. వచ్చే నెలలో అమరావతిలో నిర్వహించనున్న ఆంధ్ర టెన్నిస్‌బాల్ ప్రీమియర్ లీగ్ పోటీల(ఏటీబీపీఎల్)కు ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించిన నిర్వహించిన వేలాల్లో ఎమ్మిగనూరు నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. వీరిపై ప్రత్యేక కథనం..

–న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు.

ఆల్‌రౌండర్‌గా సత్తా చాటి..

పట్టణానికి చెందిన ఇమ్రాన్ డిగ్రీ రెండో ఏడాది చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. తల్లిదండ్రులు సుభాన్, అమీనా వ్యాపారంలో రాణిస్తున్నారు. క్రికెట్‌లో బౌలింగ్, బ్యాటింగ్‌లో సత్తా చాటుతూ ఆల్ రౌండ్ ప్రతిభ చూపుతున్నాడు. అండర్-16 విభాగంలో 2019లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కర్నూలు జట్టు తరపున ప్రాతినిధ్యం వహించాడు. రాష్ట్ర స్థాయిలో విశాఖలో జరిగిన పోటీల్లో తన ఆటతీరుతో 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు. అండర్-19 విభాగంలో 2022లో అనంతపురంలో జరిగిన పోటీలో ప్రతిభ చాటాడు. తాజాగా నిర్వహించిన వేలాల్లో కడప జట్టుకు ఎంపికయ్యాడు. ఈ ఏడాది ఒంగోలులో జరిగిన పోటీల్లో జట్టు విజయాల్లో కీలకంగా వ్యవహరించాడు. భవిష్యత్తులో జాతీయ జట్టులో స్థానమే లక్ష్యంగా సాధన చేస్తున్నాడు.

నాసిర్.. బ్యాటింగ్‌లో మెరుపుల్

పట్టణానికి చెందిన నాసిర్ డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులు బడేసాబ్, రషీదా. తండ్రి చనిపోవడంతో తల్లే కుటుంబ బాధ్యతను చూస్తున్నారు. ఆమె కష్టానికి ప్రతిఫలం చూపాలనుకున్న నాసిం క్రికెట్‌ను ఎంచుకుని సాధన చేశాడు. అండర్-14, అండర్-18 విభాగాల్లో 2019, 2022లో జరిగిన ప్రదర్శనల్లో ఏపీ జట్టు తరపున ఆడాడు. బౌండరీలు కొట్టడంలో నాసిర్ దిట్ట. కర్నూలులో నిర్వహించిన టెన్నిస్ బాల్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో తన ప్రతిభ చూపడంతో ఒంగోలులో జరిగే పోటీలకు ఎంపికయ్యాడు. అక్కడ జరిగిన పోటీల్లోనూ సత్తా చాటాడు. ఏటీబీపీఎల్ వేలాల్లో కడప కింగ్స్ జట్టుకు ఎంపికయ్యాడు. ఎప్పటికైనా జాతీయ జట్టులో స్థానం సంపాదించాలనేదే తన లక్ష్యమని చెబుతున్నాడు.

చేనేత బిడ్డ విజయం

ఎమ్మిగనూరుకు చెందిన గుణ స్థానికంగా ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్నాడు. తల్లిదండ్రులు తిమ్మప్ప, లలిత చేనేత కార్మికులు. క్రికెటర్‌గా రాణించాలనే పట్టుదలతో గుణ ఐదేళ్లుగా సాధన చేస్తున్నాడు. బ్యాటింగ్‌లో మెలకువలు నేర్చుకున్నాడు. బౌండరీలు కొట్టడంతో ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. మూడు నెలల క్రితం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మంచి ప్రదర్శన కనబరిచాడు. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ పోటీల కోసం నిర్వహించిన వేలాల్లో అనంతపూర్ సన్‌రైజర్స్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ ఏడాది కర్నూలు, ఒంగోలులో జరిగిన ఎంపిక పోటీల్లో అర్ధ సెంచరీలు చేసి రెండు సార్లు ప్రతిభా పురస్కారాలు కైవసం చేసుకున్నాడు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే పట్టుదలతో సాధన చేస్తున్నాడు గుణ.

(c) eenadu

కర్నూలు
• కర్నూలు • పాణ్యం

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలి

పోలీసు క్రీడాకారులతో కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : పోలీసు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాస్ఫూర్తి చాటి విజేతలుగా నిలవాలని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ సూచించారు. సెప్టెంబరు 1 నుంచి 4వ తేదీ వరకు గుంటూరులో ఏపీ పోలీసు స్పోర్ట్స్ మీట్ జరుగనున్న సందర్భంగా నగరంలోని డీఐజీ కార్యాలయ ఆవరణలో శనివారం ఆయన క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐలు చంద్రబాబునాయుడు, తేజోమూర్తి, తిక్కస్వామి, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి

కర్నూలు నగరపాలక సంస్థ : 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు నమోదు చేసుకోవాలని కర్నూలు నియోజకవర్గ ఆర్వో చల్లా ఓబులేసు సూచించారు. స్థానిక ఇందిరాగాంధీ స్మారక నగరపాలక పాఠశాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆదివారం నిర్వహించే ప్రత్యేక శిబిరాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05408, ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ?: ఎ.క్యాంపులోని వీధుల్లో మురుగునీటి కాలువలను శుభ్రం చేయాలి. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. - **ఈశ్వర్, ఎ.క్యాంపు** ?: కల్లూరులో దోమల బెడద ఉంది. ఫాగింగ్ చేయాలి. - **వెంకటేశ్వర్లు, కల్లూరు**
✔: నగరంలో మురుగు కాలువలను శుభ్రం చేయిస్తాం. ఫాగింగ్ చేస్తాం. - **నగరపాలక అధికారులు**

చట్టాలపై అవగాహన పెంచుకోండి

అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి లీలా వెంకటశేషాద్రి సూచించారు. నగరంలోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగరపాలక పాఠశాల, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్మారక నగరపాలక పాఠశాలల్లో శనివారం న్యాయ విజ్ఞాన క్లబ్‌లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 2వ బెటాలియన్ సూపరింటెండెంట్ మహబూబ్ బాషా, పారా లీగల్ వాలంటీర్ రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ డా.సిరి బ్యాంకు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణం, విద్య రుణాలు, ఎంఎస్ఎంఈ, వ్యవసాయ మౌలిక వసతులు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో రుణాల లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఆర్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ రవీంద్రబాబు, ఎల్‌డీఎం పి.మోహన్, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, కెనరా బ్యాంకు ఆర్ఎం సుశాంత్‌కుమార్, డీఏవో వరలక్ష్మి, మున్సిపల్, మైనారిటీ, పరిశ్రమలశాఖ, డీఆర్డీఏ, మెప్మా, ఏపీఎంఐపీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరలను నిరంతరం పర్యవేక్షిస్తూ, రాష్ట్ర సగటున ధరలకు అనుగుణంగా వినియోగదారులకు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ నూరుల్ ఖమర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిత్యావసర వస్తువుల ధరలపై జిల్లాస్థాయి ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. సంబంధిత శాఖల అధికారులు, హోల్‌సేల్ రైస్ అసోసియేషన్లు, రిటైల్ అసోసియేషన్ల ప్రతినిధులతో జేసీ ధరలపై సమీక్షించారు. ధరలు అదుపులోకి రాకపోతే నిబంధనల మేరకు చర్యలు చేపట్టడంతో పాటు ఆంక్షలు విధించాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజారఘువీర్, జిల్లా వ్యవసాయాధికారిణి పీఎల్ వరలక్ష్మి, తూనికలు కొలతల అధికారి రాములు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను డ్రగ్స్‌కు దూరంగా ఉంచాలి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ డా.సిరి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం విద్యాశాఖ, సంక్షేమ వసతిగృహాలు, ఈగల్ టీం అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు బానిసలైతే కలిగే అనర్థాలు, కేసులపై విద్యార్థులందరికీ అవగాహన కల్పించాలన్నారు. గంజాయి సాగు చేసేవారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి పీఎల్ వరలక్ష్మిని ఆదేశించారు. సంక్షేమ వసతిగృహాల్లోని సిబ్బంది విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు.

క్యూఆర్ కోడ్ విధానం రద్దు చేయాలని వినతి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : కార్డుదారులకు నాణ్యమైన బియ్యం ఇవ్వాలన్న ఉద్దేశంతో పౌర సరఫరాల విభాగంలో కొత్తగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ విధానాన్ని రద్దు చేయాలని చౌకదుకాణాల డీలర్లు కోరారు. చౌకదుకాణాల దగ్గర బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసే విధానాన్ని వ్యతిరేకిస్తూ కర్నూలు అర్బన్ చౌకదుకాణాల డీలర్ల సంఘం అధ్యక్షుడు పి.రవి, ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్, కోశాధికారి జి.వెంకటరమణ, సంఘ సభ్యులు శనివారం జిల్లా సంయుక్త కలెక్టర్ నూరుల్‌ఖమర్, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజారఘువీర్‌లను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములో పౌర సరఫరాల అధికారులు బియ్యం బస్తాలను స్కానింగ్ చేసిన తర్వాతే చౌకదుకాణాలకు సరఫరా చేసేలా చూడాలని కోరారు.

కొరగాని యంత్రాలు.. రూ.కోట్లు నీళ్లపాలు

★ పాఠశాలల్లో మూలకు చేరిన ఆర్వో యూనిట్లు ★ కుళాయి నీరే తాగుతున్న బడిపిల్లలు

పరిశీలన

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శుద్ధజలం అందించాలన్న లక్ష్యంతో రూ.కోట్లు ఖర్చు చేసి ఆర్వో యంత్రాలను అందజేశారు. వాటి నిర్వహణ, పర్యవేక్షణ లేకపోవడంతో చాలా యంత్రాలు మూలకు చేరాయి. మరికొన్ని పాచి పట్టి దుర్వాసన వెదజల్లుతున్నాయి. కొన్ని పాఠశాలలకు శుద్ధజల యంత్రాలు మంజూరైనప్పటికీ ఇప్పటికీ బడికి చేరుకోలేదు. ఇంకొన్నిచోట్ల వచ్చినా అమర్చకుండా పక్కనపెట్టేశారు. దీంతో గత్యంతరం లేక పిల్లలు కుళాయి నీటినే తాగాల్సి వస్తోంది. రూ.కోట్లు ఖర్చయినా విద్యార్థులకు శుద్ధజలం అందని పరిస్థితి నెలకొంది.

ప్రకాష్‌నగర్‌లోని టంగుటూరి ప్రకాశం పంతులు ప్రాథమిక పాఠశాలలో శుద్ధజల యంత్రం ఉన్నప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఇక్కడి విద్యార్థులు కుళాయి నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు. మరికొందరు చిన్నారులు ఇంటి నుంచి సీసాతో నీళ్లు తెచ్చుకుంటున్నారు.

రూ.5.12 కోట్ల ఖర్చు

కర్నూలు నగరంతో పాటు కర్నూలు గ్రామీణ, కల్లూరు, ఓర్వకల్లు మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో యంత్రాల ఏర్పాటు కోసం సుమారు రూ.5.12 కోట్లు ఖర్చు చేశారు. నగరంలో మొదటి విడత కింద రూ.21 లక్షలు, రెండో విడతగా రూ.1.30 కోట్లు వెచ్చించారు. కల్లూరులో మొదటి విడత రూ.1.04 కోట్లు, రెండో దఫా రూ.30 లక్షలు ఖర్చయింది. కర్నూలు గ్రామీణ మండలంలో మొదటి దఫా రూ.82 లక్షలు, రెండో విడతలో రూ.24 లక్షలు, ఓర్వకల్లు మండలంలో రెండు విడతల్లో రూ.1.21 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇన్ని కోట్ల రూపాయలు వ్యయం చేసినా ఫలితం లేకుండాపోయింది.

పాత కంట్రోల్ రూం వద్ద ఉన్న దామోదరం సంజీవయ్య స్మారక నగరపాలక పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ శుద్ధజల యంత్రం ఏర్పాటు చేసినా కుళాయిల వద్ద పాచిపట్టి దుర్వాసన వెదజల్లుతోంది.

ఊసేలేని నిర్వహణ

పాఠశాలలకు మంజూరు చేసిన ఆర్వో యంత్రాలను అమర్చడం వరకే మా పని అన్నట్లు విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. తర్వాత అవి పాడైనా పట్టించుకోవడం లేదు. పలు పాఠశాలల్లో యంత్రాలు నిరుపయోగంగా మారాయి. చాలాచోట్ల నీరు పట్టుకునే కుళాయిల వద్ద పాచి పేరుకుపోయి దుర్వాస వస్తోంది. ఈ సమస్యల పరిష్కారంపై అటు అధికారులు, ఇటు హెచ్ఎంలు దృష్టిపెట్టడం లేదు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

● ప్రకాష్‌నగర్‌లోని నగరపాలక ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు శుద్ధజల యంత్రం మంజూరైనా ఇప్పటికీ రాలేదు. దాతలు చల్లనీటి యంత్రాన్ని విరాళంగా ఇచ్చారు. దాన్ని మున్సిపల్ కుళాయి నీటితో నింపి సుమారు 80 మంది విద్యార్థులకు అందిస్తున్నారు.

ముగిసిన షూటింగ్‌బాల్ పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని స్థానిక గుడ్‌షెపర్డ్ పాఠశాల ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీలు శనివారం ముగిశాయి. బాలుర విభాగంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (సి.బెళగల్) జట్టు విజేతగా నిలిచింది. నంద్యాల విజయ జట్టు ద్వితీయ, కర్నూలు ఆశ్రమ పాఠశాల జట్టు మూడో స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో కర్నూలు రవీంద్ర పాఠశాల జట్టు ఏపీఆర్ఎస్ (పత్తికొండ) జట్టుపై గెలిచి ట్రోఫీ గెలుచుకుంది. కోవెలకుంట్ల సెయింట్‌జోసఫ్ పాఠశాల జట్టు మూడో స్థానంలో నిలిచింది. విజేతలుగా నిలిచిన జట్లకు పాఠశాల కరస్పాండెంట్ మిన్నెల్ల, ఏపీ షూటింగ్ బాల్ ప్రధాన కార్యదర్శి పరశురాముడు, పోటీల నిర్వాహకుడు మధుసూదన్ ట్రోఫీలు అందజేశారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఉపేక్షించం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కల్లూరు పట్టణ పరిధిలోని సర్వే నంబరు 182లో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు శనివారం రాత్రి తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దారు ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు, రస్తా, పోరంబోకు స్థలాలను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కొన్ని రోజుల కిందట ఈ సర్వే నంబరులోని రస్తా పోరంబోకు భూమిలో కొందరు గుడిసెలు వేసి ఆక్రమించాలని చూస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో ఆక్రమణలను తొలగించినట్లు తెలిపారు. ఈ రెవెన్యూ అధికారులు, స్థానికులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించండి

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : విద్యార్థులకు క్రీడలపై ఉన్న ఆసక్తి, ప్రతిభను గుర్తించి సరైన శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులపై ఉందని కేవీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ ఛైర్మన్ డా.కె.వి.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని శ్రీసాయి కృష్ణ డిగ్రీ కళాశాలలో శనివారం క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఆర్‌యూ క్రీడల సమన్వయకర్త శివకిషోర్, ఐఏఎస్ఈ కళాశాల వ్యాయామ అధ్యాపకుడు డా.వై.కల్యాణకుమార్, శ్రీసాయి కృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జానీబాకర్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒలింపిక్ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగరత్నమయ్య అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానించారు.

పట్టుదలతో లక్ష్యాలు చేరుకోవాలి

విజేతలకు బహుమతులు అందజేస్తున్న క్రీడా సంఘాల నాయకులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : క్రీడాకారులు పట్టుదలతో సాధన చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని శ్రీలక్ష్మి విద్యాసంస్థల డైరెక్టర్, ఛైర్మన్ ఎన్.దీక్షిత్ సూచించారు. జిల్లాస్థాయి పికిల్‌బాల్, వాలీబాల్, ఖోఖో, హాకీ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక డీఎస్ఏ స్టేడియంలో జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో శనివారం బహుమతులు అందజేశారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో క్రీడా సంఘాల నాయకులు దాసరి సుధీర్, ప్రవీణ్, సుంకన్న, గుడిపల్లి సురేందర్, వ్యాయామ ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

తెలుగుభాష అభివృద్ధికి కృషి చేద్దాం

తెలుగు కల్లం సాహితీ సమితి ఆధ్వర్యంలో కవులకు సత్కారం

శ్రీచైతన్య పాఠశాలలో చిన్నారుల నృత్యం

కేవీఆర్ కళాశాలలో బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపల్ భారతి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : గిడుగు రామ్మూర్తి స్ఫూర్తితో ప్రతిఒక్కరు తెలుగు భాష అభివృద్ధికి కృషి చేయాలని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భారతి పిలుపునిచ్చారు. నగరంలోని కేవీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగులో రాణించిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.

● నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నాగరాజుశెట్టి మాట్లాడుతూ తెలుగుభాషను ఆచరించడమే గిడుగు రామ్మూర్తికి అర్పించే నిజమైన నివాళి అన్నారు. అనంతరం తెలుగుభాషపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

● నగరంలోని విఠల్‌నగర్‌లో ఉన్న గుడ్‌షెపర్డ్ పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కరస్పాండెంట్ మిన్నెల్ల మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి సేవలను కొనియాడారు.

● నగరంలోని సాహితీ స్రవంతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ తెలుగు భాష వికాసం కోసం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, నగర ప్రధాన కార్యదర్శి పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని అరోరానగర్‌లో తెలుగు కల్లం సాహితీ సమితి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. సమితి అధ్యక్షుడు చిన్నావుల వెంకటరాజారెడ్డి మాట్లాడుతూ తెలుగుభాషలో పుస్తకాలు రచించేందుకు కవులు, రచయితలు ముందుకురావాలన్నారు. అనంతరం అన్వేషణ కవితా సంపుటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, రచయిత బీవీ స్వరూప్‌సిన్హా తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : విద్యార్థి దశ నుంచే తెలుగుభాషపై పట్టు సాధించాలని ఏజీఎం సురేష్ పేర్కొన్నారు. నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో శనివారం తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళి అర్పించారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మంజుల, ఆర్ఐ రామాంజనేయులు, కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, డీన్ రాజేశ్, ఏవో పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిడ్జూరు కవలలు.. బరువులెత్తితే పతకాలు

సాద్.. స్వర్ణాల వేట

నిడ్జూరుకు చెందిన షేక్ సాద్‌బాషా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రెండేళ్లుగా వెయిట్ లిఫ్టింగ్ సాధన చేస్తూ 70 కిలోల విభాగంలో రాణిస్తున్నాడు. ■ 2025 సెప్టెంబరు మొదటి వారంలో కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో 70 కిలోల విభాగంలో బంగారు పతకం అందుకున్నాడు. ■ 2025 అక్టోబరులో కర్నూలులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో స్వర్ణం గెలుపొందాడు. ■ 2025 నవంబరు 28న గుంటూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. ■ 2026 జులై 28న అమరావతి ఛాంపియన్‌షిప్ -2026 పోటీల్లో భాగంగా కర్నూలులో నిర్వహించిన కర్నూలు నియోజకవర్గ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణం అందుకున్నాడు. ■ అమరావతి ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఈనెల 11వ తేదీన కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో 70 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించాడు. ■ ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం అందుకున్నాడు.

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : వెయిట్‌లిఫ్టింగ్ పోటీల పట్ల ఆసక్తితో శిక్షణ తీసుకుంటూ.. నిత్యం సాధన చేస్తూ బరువులెత్తడంలో నేర్పు సాధించారు కర్నూలు మండలం నిడ్జూరుకు చెందిన కవల సోదరులు షేక్ సాద్‌బాషా, షేక్ జైద్‌బాషా. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటూ విజేతలుగా నిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటుతున్నారు. నియోజకవర్గ, జిల్లా స్థాయిలో స్వర్ణ పతకాలు అందుకున్న వీరు.. రాష్ట్రస్థాయిలో రజతాలు సాధించి ప్రశంసలు అందుకుంటున్నారు.

జైద్.. జైత్రయాత్ర

షేక్ జైద్‌బాషా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రెండేళ్లుగా వెయిట్ లిఫ్టింగ్‌లో 75 కిలోల విభాగంలో సత్తా చాటుతున్నాడు. ■ 2025 సెప్టెంబరు మొదటి వారంలో కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో బంగారు పతకం అందుకున్నాడు. ■ 2025 అక్టోబరులో కర్నూలులో నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 పోటీల్లో స్వర్ణం గెలుచుకున్నాడు. ■ 2025 నవంబరులో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 పోటీల్లో కాంస్యం అందుకున్నాడు. ■ అమరావతి ఛాంపియన్‌షిప్‌లో భాగంగా కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో 2026 జులై 28న జరిగిన కోడుమూరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో, ఈనెల 11న నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో బంగారు పతకాలు గెలుపొందాడు. ■ ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీల్లో రజతం సాధించాడు.

ఉల్లి గరిష్ఠ ధర రూ.3,629

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో శనివారం క్వింటా ఉల్లి గరిష్ఠ ధర రూ.3,629 పలికింది. వేరుసెనగకాయలు రూ.8,371, ఆముదాలు రూ.6,815, కందులు రూ.7,919, మినుములను రూ.6,721 గరిష్ఠ ధరలతో వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సునీల్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఇద్రుస్‌బాషా (56) కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా ప్రమాదవశాత్తు వాహనం డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన ఇద్రుస్‌బాషాను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వెల్లడించారు.

PASSPORT MISSING
I, MULLA NISAR AHAMMED S/o. MULLA KHALID AHAMMED, R/o H.No: G-266-6, RTC Colony, Plot No. 90, Backside Mr.Idly Hotel, Kurnool Dist., A.P - 518002, have lost my Passport Vide **Passport No. N6176898**, Date of issue 29-12-2015, Date of Expiry: 28-12-2025 while i was travelling from H.No: 50/746/19A, Tagore Nagar, Kurnool Dist., A.P. for xerox purpose on 19-08-2026. If anyone found please inform to address. **Cell: 97311 16598.**

SAME NAME
I, **Nichenametla Vijaya Mohan,** S/o. **Venkata Ramanaiah Nichenametla @ Nichenametla Venkata Ramaiah** R/o. H.No: 43/198/A-3, Narasingarao Peta, Kurnool, Kurnool District - 518001, (AP) State that my father's name has been entered as **NICHENAMETLA VENKATA RAMAIAH** in my Aadhar Card bearing No: 9157 5859 5429 as issued by the concerned authorities. And my father's name has been entered as **VENKATA RAMANAIAH NICHENAMETLA** in my Indian passport bearing No: P3558618 as issued by the concerned authorities. I hereby declare that the names **NICHENAMETLA VENKATA RAMANAIAH** and **VENKATA RAMANAIAH NICHENAMETLA** belongs to my father only and hence I am giving this advertisement.

ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెదేపా యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ పేర్కొన్నారు. కల్లూరు పట్టణం శరీన్‌నగర్ 31వ వార్డులో శనివారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి శైలజయాదవ్, నాయకులు మల్లికార్జున, పుల్లయ్యగౌడ్, రఘుగిరిధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులను ఆక్రమిస్తే చర్యలు

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలో రహదారులను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. బళ్లారి చౌరస్తా సమీపంలోని సర్వీసు రహదారిలో ఆక్రమణలను శనివారం ఆయన ఆధ్వర్యంలో తొలగించారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు, రహదారి ప్రమాదాలను దుకాణదారులు గుర్తించి సహకరించాలన్నారు.

ఐదురోడ్ల కూడలిలో పనులను పరిశీలిస్తున్న నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు

నగర సుందరీకరణే లక్ష్యం

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగర సుందరీకరణే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు చెప్పారు. స్థానిక ఐదు రోడ్ల కూడలిలో చేపట్టిన ఆధునికీకరణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరాన్ని సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రధాన కూడళ్లు, రహదారులు, విభాగినులు, పాదబాటల అభివృద్ధిపై దృష్టి సారించామన్నారు. నగరంలో తొమ్మిది కూడళ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. రహదారుల వెంట పచ్చదనం పెంపు, మొక్కలు నాటడం, గోడలపై చిత్రాలను గీయించడం వంటి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన ఏడీ ప్రతాప్‌రెడ్డి, డీఈఈ కృష్ణలత తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై విస్తృత ప్రచారం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : హెచ్ఐవీ, ఇతర రోగాలు, వైద్య పరీక్షలపై జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో ప్రచార రథం ద్వారా 15 రోజుల పాటు విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎయిడ్స్, కుష్ఠు, టీబీ నియంత్రణ విభాగం అధికారి డాక్టర్ భాస్కర్ తెలిపారు. స్థానిక సర్వజన వైద్యశాలలోని అత్యవసర విభాగం ఎదుట ఎల్ఈడీ తెరతో కూడిన ప్రచార రథాన్ని ఏఆర్‌టీ నోడల్ అధికారి డాక్టర్ సోమన్నతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ అధికారి అబిగేయల్, వైద్యులు మల్లికార్జున్‌రెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ అలీహైదర్, దేవీశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా టీబీ నియంత్రణాధికారి డాక్టర్ భాస్కర్

విధులు బాధ్యతగా నిర్వర్తించాలి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ఒప్పంద ఉద్యోగులు విధులను బాధ్యతగా నిర్వర్తించాలని సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. సర్వజన ఆసుపత్రిలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులు శనివారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఎదుట నిరసన తెలిపారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఆయన ఒప్పంద ఉద్యోగుల సంఘం నాయకులను పిలిపించి సమస్యలు తెలుసుకొన్నారు. తమ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని, విధానపరమైన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. నిరసన పేరిట రోగులకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. ఒప్పంద ఉద్యోగుల సంఘం జేఏసీ ఛైర్మన్ శ్రీదేవి, కార్యదర్శి నరేంద్రబాబు, సహాయ కార్యదర్శి హేమలత తదితరులు పాల్గొన్నారు.

పెద్దకర్మ



మంచితనానికి మారుపేరుగా నిలిచి,
ప్రేమ అనురాగాలు పంచి, అందరి
అభివృద్ధిని ఆకాంక్షించే మహోన్నతమైన
వ్యక్తి మా నుండి దూరమై దైవసన్నిధికి
చేరిన మీ మధురస్మృతులు
మా మదిలో పదిలంగా ఉన్నాయి.
మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ శ్రీ ధనిరెడ్డి విశ్వనాథ రెడ్డి గారు
విశ్వసాయి బిల్డర్స్ అధినేత
జననం: 01-07-1947 మరణం: 15-08-2026

పెద్దకర్మ: 31-08-2026 సోమవారం మధ్యాహ్నం గం॥ 12-00లకు మా స్వగృహం, టెలికాం నగర్, కర్నూలు నందు జరుగును. సెల్: 94416 97849

భార్య:
ధనిరెడ్డి మునిరత్నమ్మ
కుమారులు-కోడళ్ళు
డి.మురళీధర రెడ్డి-శ్రీమతి పుష్పేంద్రాదేవి
డి.ప్రశాంత్ కుమార్ రెడ్డి-శ్రీమతి రాజ్యలక్ష్మి
మనుమలు - మనుమరాళ్ళు
డి.సాయిచరణ్ రెడ్డి-శ్రీమతి శృతి శ్రీనంద - డా॥ సమీర
డి.ఉదయ్ రెడ్డి - హాన్సిక
మరియు కుటుంబ సభ్యులు